ప్రబుద్ధాంధ్ర

కళాభివర్ధనీపరిషత్తుపక్షమున ప్రకటింపబడు మాసపత్రిక

సంపాదకుడు:— శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

సంపుటము ౫ } రాజమహేంద్రవరము అక్టోబరు ౧౯౩౪ { సంచిక ౧౦

అన్నంత పనీ జరిగింది

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

"కట్టినవి సిరుకావి బట్టలూ, దిద్దింది క్రాపింగు జుట్టూనూ. ఎవ రయ్యా నువ్వూ!"

"అన్నార్తుల్లో వొకణ్ణండి"

"ఇది వరకే రోజుకి ముగ్గురు చొప్పున వున్నారు వారాల విద్యార్థులు. వొక్క శనివారం మాత్రమే యిద్ద రున్నారు. నువ్వు మూడో వాడవు తప్పకుండా రావచ్చు"

"నా మనవి—"

"ఇంకా యేమిటీ? కోర్టుకి తొరగా వెళ్లిపోవాలే నేను?"

"నా సంగతి నిమిషాల్లో—"

"గంటకి అరవై నిమిషాలు"

"అయిదు చాలండి నా విన్నపానికీ, తమ సెలవు కూనూ"

"మోటా రెక్కబోతూ వుండగా—"

"నాలుగు—"

"అదీ యెక్కువే"

"మూడు—"

"కానియ్యి"

"నేను తమ సాయం—నే నిప్పు డున్న స్థితిలో అది సాయంలోనే చేరుతుం దండి"

"కానియ్య మన్నాను"

"నే నిప్పుడు వారం కోసం రాలే దండి"

"డబ్బు కావా లంటావా?;

"సరిగా అంతే నండి; కాని దానికి జీతం అని పేరు పెట్టా లని మనవి"

"కవిత్వం కడుతున్నావే! చమత్కార మైన వాడవే, అయితే యేం పని చేస్తావు నా దగ్గిర?"

"తమ కేం అవసర మైతే అదీ, తమ రేం చెయ్య మంటే అదీ నండి"

"గుమాస్తాగిరీ"

"చెయ్యగల నండి"

"అటెండరీ"

"అభ్యంతరం లే దండి"

"మహానసం మీద సూపర్వైజరీ"

"ఆక్షేపణ లే దండి"

"అవసరం తటస్థిస్తే యెప్పు డేనా—పారు

"సందేహించ నక్కర లేదండి"

"అయితే యిక నీకు చేత గాని పనేమి టయ్యా?"

"ఏదో వొక ప్రయోజనం తీర్చకుండా డబ్బు అడగడం"

"సెబాస్! దిట్ట మైనవాడవే. చూడతగ్గ వాడవు కూడానూ. అయితే వుండిపో తరవాత మాట్లాడుకో వచ్చు"

"చిత్తం ఇన్నాళ్లకి నాకు అవలంబం—"

"ఏమిటీ?"

"ఎన్ని విధాల ప్రయత్నాలో చేశాను. ఎందరో్ని ఆశ్రయించాను; కాని యీమాత్రం మాట అన గలిగిన వారు కనబడ లేదండి"

"దాని కేం లే? మరి నేను వెళ్లిపో వచ్చునా?"

"సెల వయితే కోర్టుకి వస్తా నండి"

"అక్కర లేదు"

"అయితే నాకు సెలవు దయచెయ్యండి"

"ఎక్కడికి?"

"నాళంవారి సత్రంలో బస చేశా నండి"

"భోజనం యిక్కడే, తెలిసిందా?"

"తెలిసిం దండి"

"ఎప్పుడూ?"

"ఇందాకా సూచన గానూ, ఇప్పుడు స్పష్టం గానూ నండి"

"బాగుంది. అయితే తొందరగా వెళ్లాలా?"

"మూడు నిమిషాలూ మగిసిపోయా యండి. అక్కడ తమకి తొందర పనులు—"

"అయితే లే, నువ్వేం చదివావూ?"

"లోవరు సెకండరీ సర్టిఫికెట్టు సంపాదించాను. మేఘసందేశం కూడా పూర్తి చేశా నండి"

"అందులోనూ యిందులోనూ కూడా త్రయమే అన్న మాట"

"చిత్తం"

"మరి వెళ్లిరా"

"..............."

"నీ పే రెవరూ?"

"రామచంద్రశాస్త్రి"

"ఇంటి పేరు?"

"వేమూరి వా రండి"

"వూరు?"

"మహేంద్రవాడ"

"సరే"

"తమరు కోర్టునుంచి వచ్చేటప్పటికి మళ్లీ దర్శనం చేసుకుంటా నండి"

"మా వొంటెద్దు బండి తీసుకు వెళ్లి సామాను పట్టించుకు వచ్చి, అదిగో,—అగదిలో ప్రవేశించు"

"సామా నల్లా చిన్న రైలు సంచీ మాత్రమే, బండి పని లే దండి"

"వెళ్లిరా"

౨

పంతులయ్యా, రామచంద్రమూ మళ్లీ రాత్రి భోజనాల దగ్గర కలుసుకున్నారు. ఆపూట వారాల విద్యార్థులు ముగ్గురూ కాక మరో నలుగురు అభ్యాగతులు కూడా వున్నారు. చిన్న గుమాస్తా లిద్దరూ సరే సరి. మొత్తానికి బంతి బాగా పూటుగానే వుంది.

వడ్డన వాయువేగమనోవేగాలమీద పూర్తి చేసి జానకమ్మ నేతిగిన్నె పట్టుకుని వంటింటి గుమ్మంలో నుంచుంది.

అలవాటు చొప్పున పంతులయ్య యెదటి బంతీ తన బంతీ కూడా పారచూశాడు. మెరుపు దీపాలు మూడూ ఝామ్మని వెలుగుతున్నాయి; కనక హాలంతా నల్లపూస కూడా కనపడే టంత ప్రకాశమానంగా వుంది. ఆ వెలుగులో పంతులయ్యకి రామచంద్రశాస్త్రి మొగమ్మీద యేదో విలక్షణతేజస్సు కనపడింది.

"వచ్చావా?"

"చిత్తం. నేను చిన్న గుమాస్తాగారితో మాట్టాడుతూ వుండడంవల్ల తమరు కోర్టునుంచి రావడమూ, షికారు వెళ్లడమూ గమనించలేకపోయానండి"

"కోర్టులో వొక గంట వూరికే కూచోవలసి వచ్చింది. నిన్నక్కడికి తీసుకువెళ్లనందుకు చాలా విచారించాను"

"తమ రలా సెల విస్తే—"

"తప్పేమీ? అది అక్షరాలా నిజం. నిజం చెప్పడం తప్పా?"

అప్పు డొక అభ్యాగతు డందుకున్నాడు.

"వాస్తవం అన్నది, చూచారూ? సత్యం హృదయానికి ఉత్తేజనం కలిగిస్తుంది. అసత్యం దాన్ని కుంగదీసేస్తుం దండి"

"మీ ప్రసక్తి లేదిప్పుడు. చూస్తూ వింటూ వుండండి"

"చిత్తం, చిత్తం. తమ సెలవూ. సందర్భం వచ్చింది కనక—"

"కాదు కనక వూరుకో మంటున్నాను"

"........................"

"రామచంద్రం!"

"ఏమి సెలవు?"

"నువ్వని వచ్చేస్తోంది మాట. ఎవర్నీ కూడా 'మీ' రనడమే మంచిది కాని—"

"భృత్యుణ్ణి 'నువ్వ'ని పిలవడమే ధర్మమండి.

"అయితే నువ్వక్కడ కాదు, నాయెదటికి రా"

ఇది విని యెదటి బంతిలో మొదట కూచుని వున్న మూడో గుమాస్తా చివరికి వెళ్లాడు. రామచంద్రం పైకి వచ్చాడు. గుమాస్తాల కిద్దరికీ అన్నారుస్తుణ్ణంటూ ప్రాధేయపడి వచ్చినవాడి కిలాంటి ఆదరణ కలగడం చాలా యిబ్బందిగానే వుంది; కాని—తుక్కిన పేలలాగ—చూపులు విస్తళ్లమీదకి తిప్పేసుకున్నారు.

"ఇతగా ణ్ణెరుగుదువా జానీ?"

"యెరగను"

"ఎప్పు డేనా చూశావా!"

"లేదు"

"అయితే యింటో మనిషిని చూసినట్టు చూస్తూ వుండు"

"అలాగే"

ఈమాటలు విని చకితురాలై! వంటింటో చారూ అన్నమూ తింటూ వున్న సుభద్రమ్మ రామచంద్రాన్ని తొంగి చూసింది.

తరవాత పంతులయ్య వుద్ధరిణతో నీళ్ళు చేతిలో పోసుకుని "ఇక కానిద్దామా? ఏమండీ అవధానులు గారూ! పరిషేచన చేద్దామా?" అంటూ విస్తరి మీద చల్లాడు.

3

పంతులయ్య వుయ్యాలా మంచంమీద కూచుని వుండగా సుభద్రమ్మ తాంబూలపు పళ్లెం తెచ్చి అందించి పక్కని కూచుంది.

"ఏం తల్లీ?"

"మళ్ళీ వొక కథ రాసేశాను నాన్నారూ!"

"అయితే సాఫు రాయించా లన్న మాట"

"అవు నండీ"

"పొద్దున్న—పోనీ రామచంద్రం రాయగలడేమో?"

"కనుక్కోండి నాన్నారూ! సూరయ్యగారు రాస్తే నేను మళ్ళీ దిద్దుకోవలసివస్తోం దండీ"

"నాయుణ్ణి పిలు"

సుభద్రమ్మ పిలవగా పోతునాయుడు గబగబా పైకి రావడమూ, పంతులయ్య చెప్పడమూ, నాయుడు కిందికి వెళ్ళి పిలవడమూ, రామచంద్రం రావడమూ వెంట వెంటనే జరిగిపోయాయి. సుభద్ర లేచి పక్కనున్న మంచంమీద కూచుంది. పంతులయ్య వుయ్యాలా మంచంమీద చోటు చూపించి కూచో మన్నాడు; కాని రామచంద్రం అలాగే నుంచున్నాడు.

"ఏం?"

“నా కిదే తగిన పద్ధతండి”

“ఏమిా ?”

“తమరు క్షమించాలి. నేను భృత్యుణ్ణి”

“సరే. మర్యాదల సంగతి తరవాత తేల్చుకుందాం; కాని మా అమ్మాయి తరుచు చిన్నకథలు రాస్తూ వుంటుంది. నువ్వు సాఫు రాయగలవా ?

“రాయగల నండి”

“నువ్వు తెనుగులో రచన చెయ్యగలవా?”

“కొంచెం చేత నవునండి. అయితే; వ్యావహారికంలో వెళ్ళినట్టు గ్రాంథికంలో వెళ్లదండి కలం ముందుకి”

“అదే నోయ్! వ్యావహారికం అప్పుడే దేశం అంతా పాకిపోయింది కాదూ! మహా దిట్టమైనవాడోయ్ గిడుగు రామమూర్తి పంతులూ! నవీనవాఙ్మయనిర్మాత లైన యువకుల సంపర్కిలోపు వేసుకున్నాడు పంతులు. ముసలి తలకాయలు గ్రాంథికమా అంటూ గోలపెడితే మాత్రం ఆవాదం యింకెన్నాళ్లు నిలుస్తుందీ? .... మా అమ్మాయి క్కూడా రామమూర్తి పంతులు వాదమే నచ్చింది. నువ్వూ మా అమ్మాయీ చివరికి వొక జట్టులోనే చేరారు బాగుంది కనక నువ్వు సాఫు రాయడమే మంచి దన్న మాట”

“తమ అమ్మాయిగారి లాంటి యువతీమణులు వ్యావహారికంలో చిన్న కథలు రాయడం ఆధునికాంధ్రవాఙ్మయచరిత్రలో వొక ప్రత్యేకప్రకరణం ప్రారంభించడం అన్నమాటండి, చాలా సంతోషం”

“ఇదివరకి నాలుగో గుమాస్తా సాఫు రాస్తున్నాడు, కాని అతను రాసిన సాఫు కంటే మా అమ్మాయి రాసిన చిత్తే నయం”

“నా శక్తికొద్దీ రాసి దాఖలు చేసుకుంటానండి”

“వొక కథ రాస్తే యెలా వుంటుందో తెలుస్తుందండీ నాన్నారూ!”

“విన్నావుటోయ్ ?”

“రాసి చూపిస్తాను. దస్తూరివిషయంలో మాత్రం వెంటనే మెప్పు పొందగల నండి”

“సరే. కథ యిదేనా తల్లీ ?”

“అదే నండీ”

“ఇదిగో నోయ్ !”

రామచంద్రం దాన్ని పుచ్చుకుని “యిన్నాళ్లకి పూర్తి చెయ్యగల వని పంతులయ్య అడగ్గా పేజీలు లెక్క చూసి “రేపీపాటికి దాఖలు చేసుకుంటా నం” డన్నాడు. అది విని తండ్రీ కూతురూ కూడా చాలా ఆనందించారు. సూరయ్య యెప్పుడూ పది రోజులు కాకుండా రాసి యివ్వలేదు. “ఏమోయ్ ?” అంటే, “ఆఫీసు పని తెమలడం లేదండి ”అంటూ వూరేటాడు”

“ముందు వొక మాటు కథ చివరిదాకా చదివితే గాని రాత మొదలు పెట్టగూడ దండీ నాన్నారూ”

“వినపడింది టోయ్ ?”

“వినపడిం దండి”

“మరి వెళ్ళు. సూరయ్య నడిగితే కలమూ కాగితాలూ యిస్తాడు పుచ్చుకో”

రామచంద్రం సెలవు పుచ్చుకుని కిందకి వెళ్లిపోయాడు. తరవాత రెండు నిమిషాలకి జానకమ్మ వెండిచెంబుతో మంచినీళ్ళు తెచ్చి, కడపరాతిబల్లమీద వుంచి, హాలులోకి వెళ్లి, వొక సోఫాలో చదికిలబడింది. తండ్రికి వార్తాపత్రిక అందించి సుభద్రమ్మ తన గదిలోకి వెళ్ళిపోయింది.

౪

పొద్దున్న ఆరున్నర అయింది. జరోతీ గొట్టంలో నుంచి పొగ దూసుకు వచ్చే టట్టు చలిగాలి రివ్వున విసురుతోంది. సూర్యకిరణాలు వొణుకుతూ వొణుకుతూ అడుగు లేస్తున్నాయి. పట్నం అంతా జాగ్రదవస్థలోనే వుంది కాని అగర్భశ్రీమంతుల్లో కొందరింకా మంచాలు దిగలేదు.

అంత చలిలోనూ కూడా గోదావరి గట్టు పొడుగునా అన్ని రేవులలోనూ చాలా మంది స్త్రీపురుషులు సావకాశంగా స్నానాలు చేస్తున్నారు.

రామచంద్రశాస్త్రి అప్పుడే స్నానం చేసి వచ్చాడు; కనక కండువా కప్పుకున్నా కొంచెం వొణుకుతూనే పొగడచెట్టుకింద కూచుని సాఫు రాసిన కథలో అక్షరస్ఖాలిత్యాలు సవరిస్తున్నాడు. నాలుగో గుమాస్తా ఆవేళ చూడవలసిన కాగితాలన్నీ ఆఫీసులో బల్లమీద సవరిస్తున్నాడు. పెద్ద గుమాస్తా పారిజాతచెట్టుకింద నుంచుని కక్షిదారు తెచ్చిన కొత్త కాగితాలు చదువుతూ చెట్టుకింద ప్లీడరులాగ మధ్యమధ్య యేమిటేమిటో ప్రశ్నలు వేస్తూ లాయరు దర్జా అనుభవిస్తున్నాడు. జానకమ్మ "కాఫీకి పొద్దెక్కిపోయిందిరా" అంటూ పాలికాపు మీద చిరాకు పడి అప్పుడే లోపలికి వెళ్ళిపోయింది.

సరిగా యిలాంటి సమయంలో పంతులయ్యా, సుభద్రమ్మా గేటు తెరుచుకుంటూ లోపలికి వచ్చారు. ఇద్దరూ తలకి పూలు మఫ్లరులూ, కాలికి రబ్బరు జోళ్ళూ తొడుక్కుని వున్నారు. కొత్తవాళ్లు చూస్తే అయిద్దరూ యెవరో అభ్యాగతు లనుకుంటారు, కాని యింటి యజమానులే అనుకోరు.

ముందు పెద్ద గుమాస్తా, తరవాత కక్షిదారూ సమీపించి నమస్కారాలు చేసి నుంచోగా రామచంద్రం నమస్కారం అయిన తరవాత పంతులయ్య చేతికి కాగితా లందించాడు.

"ఏమి టోయ్?"

"తమ రిచ్చిన కథ సాఫు రాసేశా నండి"

"అప్పుడే?"

"రాత్రి పదకొండు గంటలికే రాత అయిపోయిందండి"

"ఏం చురుకూ! చూశావు టమ్మా?"

"సూరయ్యగారి చేతిలో నుంచి కాగితాలు వచ్చాటప్పటికి విసు పొచ్చి దండీ"

"అక్షరాలు కావివి ముత్యాలు. చూశు తల్లీ!"

"ఇంచక్క వుంది నాన్నారూ దస్తూరీ. ముద్దొస్తూం దండీ"

"చాలా చురుగ్గా కూడా రాస్తాడు. మంచి ప్రజ్ఞ"

"మధ్యమధ్య యేవో కొత్త మాటలు—ఇవేమిటండీ నాన్నారూ?"

"ఏమేనా చేర్చావా యేమిటోయ్!"

"తమ అమ్మాయిగారు నన్ను క్షమించక మానరనే ధైర్యంతో ఆపని చేశాను. అక్కడక్కడ కొన్ని మాటలు—లెక్కకి నాలుగు మాత్రమే—కొంచెం పేలవంగా వున్నా యనుకుని అవి అలాగే వుంచి అక్కడ వుండతగ్గ వని నాకు తోచిన మాటలు పైని చేర్చా నండి. ఇలా యిస్తే కొట్టేస్తాను"

"ఏమంటా వమ్మా?"

"చాలా బాగున్నా యండీ వారు చేర్చినవీ"

"అయితే యిక కొట్టెయ్యడ మెందుకూ?"

"వెనకటి కథలు కూడా యిలా సవరిస్తే—"

"నాకంత తాహతు లే దండి. ఏదో ఘుణాక్షరన్యాయంగా ఈమాటలు వచ్చాయండి"

"పోని, తాహతు వున్నంత వరకే సవరించు. ఏం తల్లీ?"

"ఘుణాక్షరన్యాయం అప్పుడు మాత్రం యెందుకు పట్ట దండీ నాన్నారూ?"

"విన్నావు టోయ్?"

రామచంద్రం మాట్టాడలేకపోయాడు. సుభద్ర మాటలు అతణ్ణి పరవశుణ్ణి చేశాయి.

రామచంద్రం చేసిన దిద్దుబాటువల్ల తన రచనకి వచ్చిన విశిష్టతను తలుచుకుంటూ, మధ్యమధ్య అతని మీద అపాంగవీక్షణాలు పరుపుతూ సుభద్ర కూడా పరవశురా లయింది.

"సరే. తోటలో కూడా యేమేనా సవరణలు చేయించాలేమో బాగాపరకాయిస్తూ వుండు. నేను కూడా స్నానం చేసి నిన్ను పిలుస్తాను, కాఫీ పుచ్చుకుందాం" అని చెబుతూ పంతులయ్యా, అతని వెనకాల—పదడుగుల కోమాటు రామచంద్రం కేసి తిరిగి తిరిగి చూస్తూ, సుభద్రమ్మా యింటోకి వెళ్లిపోయారు.

౫

జయంతి చంద్రమౌళి పంతులంటే రాజమహేంద్రవరం వకీళ్లలో కిరీటం లేని రాజని ప్రసిద్ధి. నెలనెలకీ యే లాయరుకీ లేని రాబడి. యెన్ని కరువులు వచ్చినా తరగని గాసులు. ఇంద్రభవనం లాంటి మేడ. చుట్టూ నందనవనం వంటి విశాలమైన వుద్యానవనం. మోరంపూడి రోడ్డున పాతిక యకరాల తోట. నడిబజారులో పెద్దపెద్ద కొట్లు. అల్కాట్టు తోటలో వొక పెద్ద నివేశనం. వొక మోటారు. వొక బ్రూహాం. వొక వొంటెద్దు బండి. పుష్కలమైన పాడి. వొకటేమిటి—అన్నింటికీ తోడు అతను మంచి భోగి త్యాగిని. చుట్టాలు, అతిథులు, అభ్యాగతులు—యెవరో వొకరు యెప్పుడూ యింటో వుంటూనే వుంటారు. రాజమహేంద్రవరంలో సాహసానికీ ఔదార్యానికీ అతనిదే మొదటి పద్దు. అతని సలహా, అతని సాయం, అతని సమ్మతి లేందే ఆపట్నంలో యే వుద్యమమూ యే కార్యమూ జరగవు. వకీళ్లంతా అతని దగ్గిర జూనియర్సులాగ మసులుకుంటూరు. అతను తప్పుడు కేసులు పట్టడని న్యాయస్థానంలో యెంతో నమ్మకం. సర్కారుకే నేదేనా వచ్చిందంటే అతని దగ్గిర అల్లికపనులు చెయ్యడానికి పోలీసులు జంకుతారు.

ఏవిధంగా చూసినా ఆపట్నంలో అతని యిష్టమే చట్టం.

కాని ముప్పయి తొమ్మిదో యేట—అంటే యిప్పటికి ఆరేళ్ల కిందట అతని భార్య చనిపోయింది. పరామర్శ చెయ్యడానికి వచ్చి మళ్లీ పెళ్లి చేసుకోవలసిందని యెందరో రోజుల్లోనే సలహా చెప్పారు. అనేకమంది కూతుళ్ల తండ్రులు రాయబారాలు పంపారు. వితంతువివాహం చేసుకుంటాడేమో నని తదుద్యమావలంబకులు కూడా కొంచెం ప్రయత్నించారు; కాని అతనందు కంగీకరించలేదు. "రోజు లెలాగేనా వెళ్లిపోతాయి. సుభద్ర చల్లగా వుంటే—నాకదే సౌఖ్యం. అదే ఆనందం" ఇది వొక్కటే అతని సమాధానం.

అతనికి సుభద్ర వొక్కత్తే సంతానం. మరి కలగా లేదూ, కలగలేదని అతనికి బెంగా లేదూ. కొడుక్కూడా లేనందుకు భార్య తల్లడించిపోయింది; కాని అతను "ఆడపిల్ల చేదా!" అన్నాడు. రోజు లిలా గడిచిపోతూ వుండగా ఆమె, జబ్బు చేసి పదిమాసాలు తీసుకుని, యెన్ని వైద్యాలు చేయించినా ప్రయోజనం లేక చివరికి కాలం చేసింది. అయితే జబ్బు ముదిరిందని తోచగానే ఆమె "పిల్ల పెళ్లేనా నా కళ్ల బెట్టండి" అంటూ ప్రాధేయపడింది. కానైతే సుభద్ర అప్పటి కనిమిదేళ్ల పిల్లే. కూతురికి అంత చిన్నతనంలో పెళ్లి చెయ్యడం అతనికి సుతరామూ యిష్టమూ లేదూ. అయినా యిది భార్య తుది కోరిక అని తాను కూడా గ్రహించి వున్నాడు; కనకనూ, స్వతహాగా ఆమె చెప్పిన పని చెయ్యకుండా వుండలేడు; కనకనూ ఆమె చెప్పిన వరుణ్ణి తెచ్చి సుభద్రకి దేవదుందుభులు మోగేటట్టు పెళ్లి చేశాడు.

అదివరకి యింటో నేనా సరిగా మసల్లేని ఆమె యీ వుత్సాహంవల్ల ఆనాలుగు రోజులూ పెళ్లివారిని భోజనాలకి పిలవడానికీ, వారికి లాంఛనాలు తీర్చడానికీ—యింకా—యింకా యిలాంటి వాటికీ విడిదిలోకి కూడా వెళ్ళి వచ్చేది. "మోటా

రులో వెళ్లే" మని అత ననేకవిధాల నచ్చజెప్పబోయాడు; కాని "నాళంవారి సత్రంలోకి—యేమంత దూరమండీ? కాకపోయినా నాకు జబ్బు మళ్ళీపోయిం దండీ" అని అగుంటలు పడ్డ కళ్లు తిప్పుకుంటూ ఆమె, మరదళ్లనీ, చెల్లెళ్లనీ, మేనగోడళ్లనీ వెంట వేసుకుని కుడుగూ కుడుగూ తిరిగేది.

మనుగుడుపులు కాగానే ఆమె ప్రోత్సాహం వల్ల అతను అల్లుణ్ణి యిల్లరికం తీసుకువచ్చాడు.

ఆవేళ రాత్రి పంతులయ్య వొళ్లో కూచుని అతని నోటికి తమలపాకుల చిలకల్లు అందిస్తూ ఆమె "నా కోరికలన్నీ తీర్చారండీ" అని మెడ చుట్టూ చేతులు చుట్టేసి, బుగ్గకి బుగ్గ ఆనిస్తూ కొత్త పెళ్లికూతురు లాగ కసింత సేపు గునిసింది.

అంతే. తరవాత వారం రోజులకే రోగం తిరగబెట్టి ఆమె గుటుక్కుమంది.

మరో రెండేళ్లకి గోదావరిలో యీతా లాడుతూ పదహారేళ్ల అల్లుడు కూడా దగా చేశాడు.

పాపం, వైధవ్యం వచ్చేటప్పటికి సుభద్రకి తొమ్మిదో యేడు వెడుతూ వెడుతూ వుంది.

ఇలాగ భార్యా పోవడం, కూతురు మూలపడ్డం వేరే సంతానం లేకపోవడం—కొన్నాళ్లదాకా పంతులయ్య పంతులయ్యలాగ తిరగలేదు; కాని మరికొన్నాళ్లకి మనస్సు రాయి చేసుకుని ప్రాక్టీసులో మునిగిపోయాడు.

గారంగా పెరిగింది కనక సుభద్ర ప్రతీ రోజూనా సరిగా బడికి వెళ్లి యెరగదు. కాగా మొగుడు పోయేటప్పటికి ఆమె రెండో తరగతి చదువుతోంది. అప్పటికామె భర్తని గురించిన దుఃఖం అట్టే యెరక్కపోయినా అత నామెని బడికి పంపించడానికి కిష్టపడలేదు. తీరిక అయినప్పుడల్లా యింటికి వచ్చి పాఠాలు చెబుతూ వుండడానికి బాలికాపాఠశాలలో పని చేస్తూ వున్న వొక వుపాధ్యాయురాలి నేర్పరిచి అతను సుభద్ర విషయంలో తల్లిగూడా చూపవలసిన శ్రద్ధ అంతా తానే చూపిస్తూ ఆమె భవిష్యత్తుకి పునాదులు వెయ్యసాగాడు

ఇది యిలా వుండగా:

జానకమ్మ కూడా చిన్నతనంలోనే విధంతువయిపోయింది. పుట్టింటికి వెళ్లి నుల్లు మాటలు పడుతూ చాకిరీ చేస్తూవుంటే రోజు లెలాగో వెళ్లిపోయి వుండును; కాని ఆమె మిషనరీల బాలికా పాఠశాలలో యేడో తరగతి చదివి వుంది; కనక అస్వతంత్రపు బతుకు ఇష్టం లేక ఆడపిల్లలికి ప్రయివేట్లు చెబుతూ రాజమహేంద్రవరంలోనే వుండిపోయింది. ఈవృత్తిలో ఆమెకి నెలకి పది రూపాయలు దొరికేవి. ఏ శిఖస్తుఅయిపోయిందో వొక చిన్న కొంప సొంతంగా వుంది కనక అద్దె బాధ లేకపోవడంవల్ల అసంపాదనతో ఆమెకి రోజులు రాజాంగంగా వెళ్లిపోయావి.

ఇలాగ నాలుగు నెలలు గడిచేటప్పటికి జానకమ్మకీ, సుభద్రకీ పరిచయం కలిగింది. తరవాత సుభద్ర కోరగా పంతులయ్య నెల కెనిమిది రూపాయ లివ్వడానికి అంగీకరించి రోజూ వొక గంట చదువు చెప్పడానికి జానకమ్మని కూడా యేర్పరిచాడు.

ఆమె తొమ్మిదింటికి వచ్చేది. ఇక్కడ తొమ్మిదిన్నరకి తండ్రికీ సుభద్రకీ భోజనసమయం. అంచేత జానకి ఆ అరగంటా పాఠం చెప్పి, మళ్లీ సాయంత్రం వచ్చి యింకో గంట చెప్పేది. వొక్కొక్కప్పుడు సుభద్ర భోజనం అయేదాకా కనిపెట్టుకుని వుండి తరవాత పాఠం పూర్తి చేసి వెళ్ళిపోయేది. మరొక్కొక్కప్పుడు సుభద్ర పట్టుపట్టగా యిక్కడే భోజనం చేసి మరోగంట సేపు యెక్కువ కూచుని వెళ్ళిపోయేది.

కాని పధెనిమిది రూపాయల ఆదాయానికి సంతోషించినంత కాలం పట్టలేదు, జానకి ఆర్జన కొందరు మొగరాజులకి కళ్ళు కుట్టింది. వారు కుట్రలు పన్నారు. అందుకు ఫలితంగా "సుభద్రనే ప్రధానంగా చూచుకుంటూ మాపిల్లలికి సరిగా చెప్పడం లే" దని వంకలు పన్ని ముగ్గురు పిల్లల్ని తల్లిదండ్రులు పంపడం మానేశారు. మర్రో పిల్ల "మా నాన్న నాకు కూడా మర్రో మేష్టార్ని కుదురుస్తాడుట" అంటూ పాట మొదలు పెట్టింది. అయిదో పిల్ల తండ్రి "జీతం తగ్గించుకుంటే గాని నావల్ల కా" దని కబురంపాడు.

ఏమిటీ చెయ్యడం? ఇంకో తొమ్మిది రూపాయలకి ఆశపడితే అసలు పదీ యెగిరిపోతున్నాయి. జానకమ్మకి సంతోషం పోయి యేడుపు వచ్చింది. ధైర్యం పోయి భయం పట్టుకుంది.

కాని పంతులయ్య యిదంతా విని "మాయింటో వుండిపోరాదూ? నే నిదివర కిస్తూవున్న ట్టైనిమిది రూపాయలూ యిచ్చేస్తూనే వుంటాను. మాతో పాటు భోజనం చెయ్యవచ్చు సుభద్ర మీ కెలాగా బహుమతీ యిస్తూ వుండాలి కనక బట్టలికి లోటుండదు. పైగా యింటిమీద అయిదారు రూపాయలు అద్దె కూడా వస్తుంది. ఆలోచించుకోండి" అనగా ఆమె కష్టసుఖాలు బేరీజు వేసుకుని "వాళ్ళని నమ్మి చావని" అనుకుని పంతులయ్య మేడలో ప్రవేశించింది.

అయితే లోకాని కవసరం లేని సంగతి లేదు కదూ? ఆమె యిరవై నాలుగేళ్ళ వితంతువు కావడం. అతను నలభై అయిదేళ్ళ విధురుడు కావడం. ఇంటో చిన్నపిల్ల సుభద్ర తప్ప మరో ఆడది లేక పోవడం. పైగా సొంత యిల్లు వుండిన్నీ జానకమ్మ పంతులయ్య మేడ యెక్కడం. ఇంకేమీ? స్వాములంతా గుసగుసలు పోయారు. యుక్తులమీద యుక్తులు పన్నారు. చర్చలు చేశారు. చివరకి ఆమె పంతుల్ని అలుముకుం దని సిద్ధాంతం చేశారు.

ఆమె అదివరకే పంతులమ్మ కనక అతనికి పంతులయ్య అని పేరు కూడా పెట్టారు.

లోకం యిలాగ ధర్మసంస్థాపనం చేస్తూవుండగా మొదట "మేష్టారూ!" తరవాత "జానకమ్మగారూ!" ఆపైని "పిన్నిగారూ!" అయి చివరకి జానకమ్మ సుభద్రకి "వొసే, పిన్నీ!" అయిపోయింది, పంతులుకి "జానీ" అయిపోయింది.

జానకమ్మకి కూడా ఆయింటో సర్వస్వాతంత్ర్యాలూ వచ్చాయి. వంటలక్క మూలంగా నెలకి నాలుగు రోజులు వంట చెయ్యడం తప్ప ఆమెకి మరే కష్టమూ లేదు.

సుభద్రకి తల్లి లేదు. అంతే; కాని ముద్దుకీ మురిపానికీ యేమీ లోటు లేదు. ఇది చూసి పంతులయ్య సంఘానికి బలాదూరు చెప్పాడు.

౨

రామచంద్రం సాఫు రాసిన సుభద్ర కథ భారతిలో పడింది. అచ్చులో చేశాక అతను చేర్చిన మాటలవల్ల వచ్చిన మాధుర్యం ఆమెకి మరీ కనపడింది. దానితో ఆమె బ్రహ్మానందపడి గబగబ వెళ్ళి తండ్రికి చూపించింది.

"తక్కిన కథలు కూడా దిద్దించిపెట్టరు టండీ నాన్నారూ?"

"అలాగే నమ్మా"

"నిజంగా?......ఏమండీ నాన్నారూ? నిజంగానే?"

"సందేహ మెందుకు కలిగిం దమ్మా?"

"అయితే మ రెప్పుడు చెప్పండీ"

"ను వ్వెప్పుడు కావా లంటే అప్పుడే"

"నిజంగా?"

"అదేమి టమ్మా?"

"మరీ—ఇవాళే చెప్పెయ్యండి రామచంద్రం గారితోటి"

"అలాగే లే"

"....................."

"ఇంకా యేమిటి?"

"ఏమండీ నాన్నారూ?"

"ఏం తల్లీ?"

"....................."

"చెప్ప వమ్మా!"

"నేను రాసిన కథ లన్నీ సాఫు రాయించి—"

"రాయించీ?...ఏమిటి తరవాతా?"

"....................."

"అ దేమి టమ్మా?"

"మీరు కోప్పడతా రేమో బాబూ?"

"....................."

"చెప్పెయ్య మంటారా?"

"ఊ"

"అచ్చుకూడా—"

"ఆమాట చెప్పడాని కింత ఆలోచన యెందు కమ్మా?"

"భయ మేసిం దండీ"

"నీకంటే నా కింకేం వుంది తల్లీ? నీ క డ్డేమి టమ్మా?"

"అచ్చు కూడా రామచంద్రంగారే—"

"అతనే చేయించా లా పని. నాకు తీరుపడి లేదు కదా? నీకు వల్లకాదు కదా? మ రెవరు చేస్తారూ?"

"....................."

"ఇంకా యేమిటి?"

"....................."

"ఇదేమి టమ్మా యివాళ యిలా..."

"చెప్పేస్తాను"

"....................."

"నాన్నారండి"

"ఎందు కమ్మా?"

"చెన్నాపట్టంలో........"

"మరీ సంతోషం. రామచంద్రాన్ని వెళ్లమం దాం"

సుభద్రకి ప్రాణాలు లేచివచ్చిన ట్టయింది. ఆ సంతోషంతో ఆమె అలాగా యిలాగా చూసేగా తోటలో కొళాయి దగ్గిర పంచెకి సబ్బు పట్టిస్తూ రామచంద్రం కనిపించాడు.

"అలా చూడండి నాన్నారూ"

"రామచంద్ర మేనా అతనూ?"

"అవు నండీ"

"ఏం చేస్తు—బట్టలు ఉతుక్కుంటు న్న ట్టున్నాడు.

"రెండు రోజుల కోమాటు సబ్బు పట్టిస్తా రండీ ఆయనా. రెండు పంచెలే వున్న ట్టున్నాయి పాపం"

"వొట్టి వెంగమాటం మనిషిలా వున్నాడు రామచంద్రం. నిన్న రాత్రి విన్నావా జీతం యెంత కావాలో తేల్చ మంటే యే మన్నాడోనూ?"

"ముందు బట్టలు కొని పెట్టండీ పాపం!"

"అయితే బజారుకి వెళ్లి నీకు నచ్చినవి పట్టుకురా"

"....................."

"హాస్యం కాదు. నీకథలు అతను దిద్దిపెడుతు న్నాడు. అతనికి నువ్వు బహుమతీ చెయ్యాలి"

"....................."

"నీయిష్టం వచ్చినంత సొమ్ము పుచ్చుకుని బజా రుకి—జానీ కూడా వస్తుంది వెళ్లు"

"....................."

"సుంచోకు మరి. అతను ఆపంచె పుతుక్కుని ఆరేశాటప్పటికి నువ్వు బట్టలు తెచ్చి అతని కివ్వాలి. వెళ్లు మరి"

"....................."

ఆబట్టలతో నాతో కూడా మోటారులో కూచోడానికి బిడియపడుతున్నా డతను. నేలం చాపులు తేవాలి సుమా?"

"పిన్నితో కూడా చెప్పండి"

"చెబుతాను లే, నువ్వు సొమ్ము తీసుకురా"

"...................."

"నీయిష్టం అన్నాను కాదూ?"

"...................."

"చొక్కాలు కూడా కుట్టించాలి సుమా"

"...................."

"అవు నండీ పాపం"

"ఇప్పుడు తెలిసిందా యెంత సొమ్ము పట్టుకు వెళ్లాలో?"

"...................."

"చేసిన పని శుభ్రంగా—మళ్లీ కక్కుర్తి వుండకూడదు. రెండు వందలు పట్టుకు వెళ్లు"

సుభద్ర మాట్టాడకుండా తాళాలు పుచ్చుకుని యినప్పెట్టె వున్న గదిలోకి వెళ్లింది "డ్రైవర్ని పిలవరా నాయుడూ" అంటూ పంతులయ్య కిందికి వెళ్లాడు.

*　*　*　*　*

"పదిహేను రోజుల్లో పుస్తకా లన్నీ పట్టించుకు రావాలి"

"చిత్తం"

"గడువు దాటగూడదు. పని తరవాయి వుండకూడదు"

"అలాగే నండి"

"ఇవాళ మెయిలుకే వెళ్లు"

"వెడతా నండి"

"సాఫు రాయడానికీ, అచ్చు వేయించడానికీ, బైండు చేయించడానికీ పదిహేను రోజులు చాలా?"

"నాలుగు కథలే కాదండీ ప్రస్తుతం వేసేవీ? ఆగడువు చాలండి"

"ఇవేనా తల్లీ కథలూ?"

"అవునండి నాన్నారూ"

"...................."

"...................."

"సూరయ్యగారి నడిగి కాగితాలు పుచ్చుకో"

"చిత్తం"

"వంటయిందా జానీ?"

"చారు పోగుస్తోంది కామప్ప"

"అయితే రామచంద్రానికి ముందు పెట్టించెయ్యి, అతన్ని మెయి లెక్కించి వచ్చి మనం తరవాత భోంచేద్దామేం తల్లీ?"

"అలాగే నండీ"

"...................."

"మరి చూస్తా మేమమ్మా?"

"...................."

"నీచేత్తోటే యివ్వాలి. తొరగా కానియ్యవమ్మా"

"...................."

"అవి పుచ్చుకోవోయ్"

"వాటి నేం చెయ్య మంటా రండి!"

"అవి నీకు బహుమతీ. నువ్వు కట్టుకోడానికి బట్టలు లేక—ఇందాకా నువ్వు పంచెకి సబ్బు పెట్టడం మా అమ్మాయి చూసింది. అదీ జానీ బజారుకి వెళ్ళి నీకు బట్టలూ, చొక్కాగుడ్డలూ తెచ్చారు. పుచ్చుకో"

"...................."

"ఏం, చూస్తా వేం?"

"నాతాహతు—"

"మోటారులో నాపక్కని కూచోవా లంటే అలాంటి బట్టలే కట్టుకోవాలి"

"...................."

"ఇక సందేహించకు. పుచ్చుకో"

"నాతల విలవ నాకు తెలుసునండి. ఇలాంటి బట్టలు కట్టడానికి నాకు గుండెలు తాళవండి"

నీతల విలవ నీకంటే నాకు బాగా తెలుసు. పుచ్చుకో"

"...................."

"నా మాట విను"

"......................."

రామచంద్రం మాట్లాడలేదు. అతని కళ్లలో ఆనందబాష్పాలు గిర్రున తిరిగాయి. ఇక నుంచో లేక పంతులయ్య కాళ్లమీద పడ్డాడు. అతని అమాయికౌనంగాన్ని చూశాటప్పటికి పంతులయ్యకి కూడా సంతోషం కలిగింది.

తరవాత పంతులయ్య చేయూత యిచ్చి లేవ తియ్యగా రామచంద్రం అప్పుడు కూడా కొంచెం సందేహిస్తూనే అట్టె అందుకున్నాడు.

ఇచ్చేటప్పుడు సుభద్రకీ, పుచ్చుకునేటప్పుడు రామచంద్రానికీ, వొకరి చెయ్యి వొకరికి తగిలింది. దానితో రామచంద్రానికి శరీరం వణికింది. సుభద్రకి వొళ్లు జల్లు మంది.

౮

"ఈపాటికి కథలు సాఫు రాసెయ్యడం కాదుటండీ నాన్నారూ ?"

"అయిపోవచ్చు"

"ఇవాళో రేపో అచ్చు మొదలుపెడతారన్న మాట. కాదుటండీ ?"

"అలా యెందుకూ ? సాఫు రాసిందల్లా అచ్చు వేసేస్తూ వుండకూడదూ ?"

"అవును నాన్నారూ ? రామచంద్రంగారికి రాయండీ అలా చేయించమని"

"అతనికి తెలవదుటమ్మా అదీ !"

"రాస్తే యేమండీ ?"

"మన మేమీ రాయవద్దు. గడువులోపున తేగలడో తేలేడో చూద్దాం."

ఈమాట వినేటప్పటికి ఆమె హృదయం తక్కుమంది. "ఈపరీక్షలో నెగ్గగలడో లేడో పాపం" అని ఆమెకి అతనిమీద జాలికలిగింది.

* * * * * *

"అరవభోజనం—రామరామా ! విధిలేక తిని వారుట నాన్నారు. పాపం రామచంద్రంగారేం చేస్తున్నారో ?"

"పదిహేను రోజులేకాదూ ? కాకపోయినా భోజనం సయించకపోతే కాఫీ వుండనే వుంది. ముద్దినుసు పిండివంటలూ—"

"అసలు ఆవకాయ పట్టుకు వెళ్లమనవలసింది, తోచిందికాదు. నువ్వేనా జ్ఞాపకం చేశావు కాదే మిటే పిన్నీ ?"

"ఇప్పుడయితే నేం, పోనీ పంపించకూడదూ?"

"అవునవును. బాగానే వుంది నీ ఆలోచన. నాన్నారితో చెప్పవే"

"నువ్వే చెప్పూ"

"నువ్వు చెప్పకూడదా యేమిటమ్మా ?"

"అయితే యింకా యేమేం పంపించాలో ఆలోచించు, నేనే చెబుతాను".

ఇది విని సుభద్ర "యింకేమున్నాయీ ? ఇంకేమున్నాయీ ?" అని ఆలోచన మొదలు పెట్టింది.

* * * * * *

"మిఠాయి కాయలుట, బత్తాయి కాయలు తెచ్చిందండి నాన్నారూ అప్పలమ్మ"

"ఏమంటుంది ?"

"ఇవ్వకుండా వెళ్లదుట"

"ఏమాత్రం తెచ్చిందీ ?"

"౧౫ పెడు"

"రెండు డజన్లు పుచ్చుకో యివాళకి. రేపు మళ్లీ తెమ్మను"

"......................."

"......................."

"ఈపాటికి చెన్నాపట్టం చేరుతుందిటండీ ఆవకాయ నాన్నారూ ?"

"నిన్ననే అందుతుందమ్మా అతనికి"

"......................."

"......................."

"ఆవేపు బత్తాయి కాయలింత బాగుండవు కాదుటండీ నాన్నారూ ?"

"మనకి నచ్చవు. అక్కడి వాళ్ళకవే అమృతం"

"నిజమే......ఇక్కడి వాళ్ళక్కడికి వెడితే వాళ్ళని చూసినప్పుడల్లా యిక్కడి పళ్ళు తలుచుకుంటూ లొట్టలు వేసుకోవలసిందే"

"...................."

"...................."

"ఏమండీ నాన్నారూ! ఇక్కణ్ణుంచి వెళ్ళిన వాళ్ళకోసం అక్కడి వస్తువులు యిక్కణ్ణుంచి తీసుకువెళ్ళి అమ్మకూడదు టండీ ?"

"అమ్మవచ్చు......పోనీ రామచంద్రానికేమైనా పంపిద్దామా తల్లీ ?"

"పంపించండి నాన్నారూ! సాఫు రాయడమూ, ప్రూఫులు దిద్దడమూ, ఆపైని అరవభోజనమూ—వేడి చేస్తుం దేమోనండీ పాపం వాళకీ ?"

"అయితే తెచ్చినవన్నీ యిచ్చేసి పొమ్మను అప్పలమ్మని"

"పాపం వారి మూలాన నాకథలు ఇంచక్కా తయారవుతాయి. పుస్తకం కూడా ముద్దులు మూట కడుతూ వుంటుంది. కదు టండీ నాన్నారూ ?"

"మరే"

"...................."

"...................."

"అయితే పళ్ళన్నీ పుచ్చుకోనా నాన్నారూ ?"

"వందేనా వుంటాయూ ?"

"తక్కువయితే తెమ్మంటాను. ఏం?"

"ఊఁ"

"మనకి రెండు డజన్లు చాలు. మళ్లీ రేపు తెస్తుంది కాదూ ?"

"అవును"

"సూరయ్యగారి నిక్కడికి పంపించనా ?"

"పంపించు"

సుభద్ర మెట్లకేసి నింపాదిగానే నడిచింది; కాని ఆమె హృదయం వురకలు వేసింది.

* * * * * *

"మొన్న మనం కొన్నామూ, కోటుగుడ్డా? అది నిగనిగ మెరిసిపోతోంది కాదుటే పిన్నీ?... "నేవీ బ్లూ" అంటారు దాన్ని......చెన్నాపట్టంలో వాళ్లు కుడితే చొక్కాలు వొంటికి పూసినట్లు సరిపోతాయిట నాన్నారి కోట్లన్నీ అక్కడ కుట్టించినవే"

"...................."

"ఆసేలం పంచెలు తెలుపుచేస్తే పాముమీసంలాగ మెరిసిపోతాయి కాదుటే పిన్నీ ?"

"అవును".

"వుప్పాడ కండువాలు కూడా రెండు కొనవలసింది. మరచిపోయాం"

"మరే నేవ్"

"అసలు సొమ్ము కూడా తక్కువ పట్టుకువెళ్లాం. మిగిలితే ఆకండువాల మాట తోచునేమో"

"పోనీ, అత నింటికి వచ్చాక కొని యివ్వరాదూ ?"

"...................."

"మీ నాన్న మాత్రం వొద్దంటారా యేమిటి?"

"ఆవేళ వారు పంచెకి సబ్బు పెడుతూ వుంటే నాకు జాలేసింది పాపం!"

"...................."

"వారికి బట్టలు కొనిపెట్టమని తీరా నోరు జారి వచ్చేసింది. మాట కాని నాన్నగారేమంటారో— ఏమనుకుంటారో అని నాగుండెలు పీచుపీచు మంటూ—బేజారైపోయా నేవ్ పిన్నోయ్"

"ఊహూ"

"ఇప్పుడు వుప్పాడ కండువాల మాట చెబితే మాత్రం—నాన్నగారికి కోపం వస్తుందే. చెప్పొద్దే. ఏమే పిన్నీ?"

"నీకు భయ మైతే నేను చెబుతాలే పోనీ"

"నువ్వు చెప్పు. నువ్వు చెబితే నాన్నారు తెప్పించి చెన్నాపట్టం పంపేస్తారు కూడానూ. అవి అక్కడ యిస్త్రీ చేయిస్తే మరీ బాగుంటాయి. కదుటే?"

"అవును"

"రామచంద్రంగారి మూలానే నాకథలు పుస్తకంగా అచ్చయిపోతున్నాయి. ఆవేళ తికథ వారు సవరించకపోతే నాకీ వూహా తోచకపోను...వారి మేలు మరిచిపోగూడదు. ఈపుస్తకం వచ్చేలాక యీమాటు తక్కిన కథలు కూడా అచ్చు వేయించెయ్య మని అడగాలి నాన్నార్కి. ఈమాటు చెన్నాపట్టం వెళ్లేటప్పుడు వారిని అక్కడ రిస్టువాచీ కొనుక్కో మంటారు నాన్నారు. కానా పిన్నీ?"

"మీ నాన్న అలాంటివారే పాపం. చూశావు కాదూ" నాకు వద్దు మొర్రో "అంటూంటే యీ రవ్వల వుంగరం కొనిపెట్టారు వేలుకి?"

"అవునవును......రిస్టువాచీ కంటే—ఏ మంటావే నువ్వూ?"

"పోనీ రెండూ యిప్పించూ నువ్వూ"

"బాబోయ్!"

౯

రామచంద్రం చెన్నపట్నం వెళ్లాక రోజులు గడిచిన కొద్దీ సుభద్ర మనస్సు యేమిటో గజిబిజి పడిపోసాగింది. అదివర కామె యేం చేసినా యేకాగ్రచిత్తంతో చేసేది. అలాంటి మనిషి కిప్పుడు మనస్సు కొస్సేపైనా నిలవదు. ఎంత మంచి పుస్తకం తీసినా నాలుగు బంతులు చదివాటప్పటికి చప్పబడిపోతుంది. ఎంత చక్కని పత్రిక పుచ్చుకున్నా అదేదో అలుముకుపోయినట్టు తోస్తుంది. హార్మోనియం మీటితే అపశ్రుతి కనపడుతుంది. తోటలోకి వెడితే వొక చెట్టులోనూ, వొక తీగలోనూ, వొక పువ్వులోనూ లావణ్యమూ, నాజూకూ కనపడవు. ఫలహారంలో యేదో రుచి తక్కువయినట్టు తోస్తుంది. కాఫీలో ఘాటూ, సువాసనా పోయినట్టుంటుంది. భోజనం దగ్గర కూచుంటే మాటలే కాని లోపలి కేమీ పోదు. మూడాకులతో తాంబూలం చెల్లిపోతుంది ఇంతే కాకుండా యేపని మొదలు పెట్టినా దృష్టి అతని మీదికే పరిగెడుతుంది. ఎంతసేపూ ఆమె అతని ఆకారాన్ని రూపించుకుంటుంది. చేష్టలు మననం చేసుకుంటుంది. మాటలు జ్ఞాపకం చేసుకుంటుంది. పంచెకి సబ్బు పెడుతూ వుండడం జ్ఞాపకం వచ్చి మనస్సు చివుక్కు మనిపించుకుంటుంది. చప్పున నిద్ర పట్టదు. పెందరాడే మెళుకువ వస్తుంది. స్నానం చేసేటప్పుడు వొకొక్కప్పుడు సబ్బుమాట మరిచిపోతుంది. వొక్కొక్కప్పుడు తడిబట్ట విడిచెయ్యకుండానే తల దిద్దుకుంటుంది. ఏమి టేమిటో చేస్తుంది.

ఏం? తన స్థితిలో ఏదో మార్పు వచ్చిం దని ఆమెకి తెలుసు. తన మనస్సులో యేదో పురికొంటోం దని తెలుసు. ఏం? ఎందుకు జరగాలీ యిలాగా? అప్పుడప్పు డామె కీ ప్రశ్న తోచడం కూడా కద్దు కాని అలాంటప్పు డల్లా "కథ లించక్క దిద్దుతారు" ఆమెకి స్ఫుటంగా కనపడే విషయం యిదీ.

వొకనాడు పొద్దున్న ఆమె యేదో యాదాలాభంగా రామచంద్రం గది కేసి వెళ్లింది. అది కనపడేటప్పటికి తాళం తియ్యా లని తోచింది. తాళం తీశాటప్పటికి గది తుడిపించా లని—ఇక నుంచుంటే వొట్టు. వొకటే గంతు. సమయానికి తండ్రి కచేరీలో వుండడం, జానకమ్మ గోదావరికి వెళ్లడం. దొడ్లో పాలికాపుతో కజ్జాపడుతూ వున్న అప్పలమ్మ మాటలు వినపడుతూనే వున్నాయి; కాని ఆమె దాన్ని పిలవలేదు. పిలవాలని అనుకోలేదు. స్వయంగా వెళ్లి చీపురు తీసుకు వచ్చి తనే తుడిచింది.

మేజా తుడిచింది. పక్క దులిపింది. కుర్చీ సరిగా సద్దింది.

ఇదంతా అయినాక, "ఎందుకిలా చెయ్యడం?" అని యెవరో అడిగినట్టయింది. ఎందుకూ? అందుకే కథలు సవరించి పెడుతున్నాడు కనక.

ప్రతీదానికీ ఆమె యీ కారణమే వూహించుకునేది; కాని యిందులో వూతం చాలినట్టుండేది కాదు. ఏదో లోటుగా వున్నట్టూ, ఏమో అతకనట్టూ కనపడేది; కాని అస లేమిటో బోధపడేది కాదు

వొకనాడు ఆమెకి హఠాత్తుగా అతని ఫొటో చూడాలని తోచింది. కాని యేదీ? మొదట ఉసూరు మనిపోయింది; కాని తరవాత లేకపోవడమే మంచి దనుకుంది. ఏమంటే? వుండడమే వస్తే ఆ ఆరుకావి బట్టలతో తీయించుకున్నదే కాదూ? ఆపాత వేషం బాగుంది కాదు. నిజమే; కాని కొత్త వేషం యేదీ? బట్టలు పుచ్చుకునేటప్పుడు కలిగిన వణుకుతోనే అతను మెయి లెక్కాడు. కట్టుకున్న దేదీ? చెన్నాపట్టంలో కుట్టిన కోట్లు పూసినట్టుండడానికి కుట్టడం అయినాక కదా? నేలంచాపు కూడా పాముమీసంలా వుండడానికి చలవచేయించాక కదా? అస లతను మడతే విప్ప లేదూ. కోటు గుడ్డ నరేసరి; కాని ఆమెకి అతనా బట్టలు ధరించి మిలమిల మెరిసిపోతూ కనపడుతున్నాడు.

అతను సాయంత్రం బీచికి వెడుతున్నాడో లేదో. ఎప్పుడేనా మెరుపు రైలూ, లైటుహౌసూ యెక్కుతున్నాడో లేదో. ఇంచక్కటి చేపలు—అదేది? అక్వేరియం—మరే, అందులోకి వెడుతున్నాడో లేదో? ఆ అడయారు, ఆ బిసెంటు నగరం, ఆ పెద్దమర్రిచెట్టు, ఆ మూజియం, ఆ పీపిల్సు పార్కు, ఆ వాంటురోడ్డు షాపులు, ఆ థియేటర్లు, ఆ హార్బరు, ఆ పైపుల చెరువు—అవన్నీ చూస్తున్నాడో లేదో? పాపం చూడవలసిన దేమిటో తెలుసునో తెలవదో! డబ్బు సరిపోతుందో లేదో? ఎక్కువ ఖర్చుచేశావనిపోతా రేమో నని యేం పొదుపుడుకులు పడుతున్నాడో?

సుభద్రకి మనస్సు మనస్సులో లేదు. పోనీ, అవున్నచోటేనా నిలకడగా వుందేమో అంటే అదీ లేదూ.

౧౦

ఎనిమిది న్నర అయింది. మూడో అంతస్థు పైని వున్న గుమ్మా యెక్కి సుభద్ర కొంతసేపు వీధి పొడూగునా చూసింది. వొక పావుగంట అయాక మొదటి అంతస్థు వీధివసారాలో పచారు చేసింది. తొమ్మి దయాక తోటలోకి వెళ్ళి ద్వారం దగ్గరగా తచ్చాడడం మొదల్పెట్టింది.

గుమ్మంలో మొదట వొక వొంటెద్దు బండి ఆగింది; కాని రామచంద్రం వచ్చు వొంటెద్దు బం డెక్కుతాడా? పైగా ఆలస్యం అయిపోదూ?... తరవాత వొక ఫీటన్ వచ్చి నిలిచింది; కాని మునీలి పండేవడో జిగి దగ్గుకుంటూ పంతులయ్య ఆఫీసులోకి వెళ్ళిపోయాడు. తరవాత వొక మోటారు వచ్చింది; కాని యింటిదగ్గిరనుంచి స్టేషనుకి మోటారు వెళ్ళలేదుగా?

సరిగా తొమ్మిదిం బావయింది. వొక జట్కా వచ్చి ఆగింది. ఎవరో పిల్లాడే. కట్టింది నేలంపంచే. తొడిగింది నేవీబ్లూ—ఆకండువా—రామచంద్రమే. తోటంతా వొక్కమాటు తళుక్కుమనిపోయింది. చూసేగా అతనూ ఆమే గేటులో వున్నారు.

"పుస్తకాలు తెచ్చా—నం—డి" అన్నా డతను; గాని తా నిచ్చాడో ఆమె పుచ్చుకుందో గమనించలేకపోయాడు. చూసేగా సుభద్ర అప్పుడే మేడ మెట్లెక్కుతోంది. నడకే; కాని అసల మంతా క్లుప్తమైపోయింది.

పంతులయ్య మేడమీద వొక జమీందారీ కేసులో యిద్దరు దాసీలను యేం చెప్పగలరో పరీ

అతను లేచి నుంచున్నాడు. తండ్రీ కొడుకులూ భారం అంతా నీదీ''అని చెబుతూ అతన్ని వీధి గుమ్మందాకా సాగనంపారు.

౨

శాస్త్రి రాయవరం వెళ్ళి అనేకవిధాల వాకబు చేశాడు; గాని సుభద్ర జకరయ్య యింటికి చేరు కుం దనీ, అతని యింటో భోజనం చేసిం దనీ మాత్రమే తెలిసింది. డాక్టరుగారివల్ల కొన్ని సంగ తులు తెలుసుకోవచ్చు నని అనుపత్రికి వెళ్ళగా ఆయన వూళ్లో లే రని తెలిసింది. మంత్రసాని వెటకారంగా మాట్లాడింది. "ఛార్జిలో యెవ రెవర్ని చేరుస్తారు బాబూ?''అంటూ కంపౌండరు తలకాయ ఆడిస్తూ అడిగాడు.

శాస్త్రి నిరుత్సాహపడి మరో వీధికి బయలు దేరగా యిలాంటి వాడే రాయవరం కాపురస్థు డొకడు తారసపడ్డాడు.

"జకరయ్య చార్జి యిప్పించక మానడు'',

"ఊహూ!''

"మిషనరీలు వచ్చి పని చేస్తారు''

"అలాగా?''

"డాక్టరుగారు, కంపౌండరు, మంత్రసాని— లక్షమంది సాక్ష్యం చెబుతారు''

"......................''

"అవిణ్ణి తండ్రీ, అన్నలూ కొడుతూ వుండగా మా లచ్చిరెడ్డి రాజమండ్రీనుంచి రైలు దిగి వస్తూ చూశాడు కూడానూ''

"......................''

"అసలు అవిణ్ణి లేవదీసిన కుర్రాయన రామ చంద్రపురంలో బోలెడు ప్రయత్నాలు చేస్తు న్నాడు అప్పుడే''

"సరే''

"చివరకి జకరయ్య అవిణ్ణి తన కొడుక్కి పెళ్ళి చేసుకుంటాడు''

"బాగుంది''

"అయితే యిదేమీ జరక్కూడ దంటే మనం చక్రం అడ్డువేసెయ్యగలం''

"దొరలు మాననిస్తారా?''

"జకరయ్య కోర్టు కెక్కితే గదా దొరలు రావడం?

"అతను మానడం యెందుకు వస్తుందీ?''

"అదంతా మన చేతిలో వుం దని చెప్పాను కాదూ? నన్ను తప్పించి యీవూళ్ళో క్రిమినల్ గాని, సివిలు గాని జరగడం మీ రెరుగుదురా?''

"..................''

"పైగా జకరయ్య నేను గీసిన గీటు దాటడు. దాటలేడు.''

"ఏం?''

"అతనికీ మాకూ యిచ్చి పుచ్చుకోడా లున్నా యి. అత నీవూళ్ళో సుఖంగా వుండడానికి నేనే ఆధారం''

"అయితే యే మాత్రం?''

"మన సంగతి మీకు తెలిసిందే. మన దగ్గిర చిల్లర్లూ, బేరాలూ లేవు. మనం కలగజేసుకున్నా మంటే అన్న ప్రకారం—యే మంటారు?''

"చెప్పండి''

"కష్టసుఖా లన్నీ ఆలోచించి మీరు చెబితే కా దంటానా?''

"అయినా,—చల్లకి వచ్చి ముంత దాచడం యెందుకూ?''

"నా కొక్క కాగితం చాలు''

"......................''

"వులిక్కిపడ్డా రేం?''

"లేదు లేదు. ఇం కెవ రెవరికీ''

"జకరయ్యని కూడా మనం కూడగట్టుకోవాలి. అంతటికీ అతనే—తెలిసిందా?''

"అంకె చెప్పండి''

"అయిదు—పెళ్ళిఖర్చు లిస్తే గాని అతను రాజీకి రాడు"

శాస్త్రి జవాబు చెప్పలేదు. నుంచోలేదు కూడానూ.

౭

రాత్రి తొమ్మిదిన్నర అయింది. అప్పటి దాకా సుభద్ర పక్కలో కూచుని ఆ కబురూ, యీ కబురూ అడుగుతూ, చెబుతూ వున్న యెలిజబెత్తు. "యిక పడుకోమ్మా" అంటూ తన పక్కమీదకి వెళ్లికూచుంది. సరిగా యీసమయంలో గేటు గుంజుతూ యెవరో పిలిచారు. జకరయ్యా హాల్లోనే పడుకుని వున్నాడు; కనక వెళ్లి తలుపు తియ్యగా "సుభద్రయ్యమ్మగోరున్నారా బాబూ" అంటూ వొక స్త్రీ లోపలికి వచ్చి నెత్తిమీది తట్ట కింద పెట్టింది. దానిమీద జకరయ్యా "నీదే వూరు? నువ్వెవతె మనిషివి? ఆవిడతో నీకేం పని?" అని అడిగాడు. అందుకా స్త్రీ "మాది పాలమూరు. నే నప్పలమ్మని. నన్ను పెంకుసోదెమ్మగోరంపారు" అని చెప్పగా ఆమాట విని ముందు సుభద్రా, అదేమిటో తెలుసుకోడానికి తరవాత యెలిజబెత్తూ యివతలికి వచ్చారు.

అప్పలమ్మ యేమి చేమిటో అడగ్గా సుభద్ర కొన్నిటికే జవాబు చెప్పి "నేను చచ్చిపోయానో లేదో చూసిరమ్మందా మా అమ్మ?" అని అడిగింది. "తండ్రీ అన్నలూ సుభద్రమ్మగారిని కళ్లబొడిచి తుప్పల్లోకి యీడ్చెయ్యడం ఆవిడికి తెలిసిందా?" అని జకరయ్యా అడిగాడు; గాని అప్పలమ్మ అది వినిపించుకోకుండా తట్టలోనుంచి వొక మూట తీసి సుభద్ర ముందుంచి "యీ మూట మీ అమ్మగారు పంపారని తెలిసినా, నేను తెచ్చానని తెలిసినా మా బుర్ర లెగిరిపోతాయి. ఇక నేను వెళ్లిపోవాలి. మానాయుడు నాకోసం రోడ్డుమీద నుంచున్నా" డని చెబుతూ లేచి నుంచుని, "మిమ్మల్నెలాగేనా కాకినాడ చేరుకోమన్నారు మీఅమ్మగారు" అంటూనే జువ్వలాగ వెళ్లిపోయింది.

తరవాత సుభద్ర యింగితం కనిపెట్టి యెలిజబెత్తు మూట విప్పి చూడగా అందులో సుభద్ర నగలు—ముక్కుపుడకల దగ్గర్నుంచీ వున్నాయి. అది చూసి ఆమె "కన్నకడుపు. పాపం యెంత విచారిస్తున్నారో అయ్యమ్మగారు" అనగా, జకరయ్యా "స్త్రీల ప్రేమ యింతటిదని యెవరూ పరిమితి చెప్పలేరు. అందులోనూ మాతృప్రేమ యెలాంటి సందర్భాల్లోనూ స్ఫుటంగా కనబడుతూనే వుంటుంది. దాన్ని అణచివెయ్యగల ప్రతికూలశక్తులు ప్రపంచకంలో యెక్కడా లేవు" అన్నాడు.

సుభద్ర రెండు కళ్లూ చెమ్మగిల్లాయి. పెదిమలు రావిరేకల్లాగ వణికిపోయాయి. వెంటనే ఆమె యేమీ మాట్లాడకుండా గదిలోకి వెళ్లి తన పక్కమీద గోడవేపుకి తిరిగి పడుకుని కుమిలి కుమిలి దుఃఖింపసాగింది.

తరవాత యెలిజబెత్తు నగలమూట జాగ్రత్త చేసి పడుకుంది. జకరయ్యా జరిగిన దాని కాశ్చర్యపడుతూ అరుబైట పచారు మొదలుపెట్టాడు.

౮

అప్పుడే సూర్యోదయం అయింది. గానుగ చెట్టు చిగురుటాకులు బాలభానుని లేత కిరణాలు పడి జిగిజిగ్గా మెరుస్తున్నాయి. పదహారు వన్నె బంగారాన్ని సడించే పొద్దుతిరుగుడు పువ్వులు విప్పారిన మొగాలతో కలకల్లాడుతూ సూర్యదేవునికి స్వాగతం యిస్తున్నాయి. అరవిచ్చి వున్న గులాబీ మొగ్గలు పిల్లగాలికి సుతారంగా వూగిసలాడుతూ కమ్మని సువాసనలు విరజిమ్ముతున్నాయి. విరగబూసి వున్న నైటుక్వీను తెల్లవార్లూ సౌరభవిలాసాన్ని ప్రదర్శించి అప్పుడే నృత్యం చాలించి బసకి వెడుతూ వున్న భోగంపిల్లలాగ దయనీయమైన విలక్షణసౌందర్యంతో దర్శనీయంగా వుంది.

వొక మాదిగ యువతి హాలు తుడుస్తోంది. యెలిజబెత్తు పొగడచెట్టు కింద కూచుని కాఫీకోసం నీళ్లు కాస్తోంది. మల్లిపందిరి దగ్గిర యీజీచెయిరులో కూచుని సుభద్ర యోచనావ్యగ్రయై వుంది. నిన్న వేరిశాస్త్రిలో రాయబారం నడిపిన సూశేజంటు చేమంతిమడి బాగుచెయ్యడం మానిపించి జకరయ్యకేదో నచ్చచెప్పా అని తాపత్రయపడుతు న్నాడు.

సరిగా యిలాంటి సమయంలో భోంయి మంటూ వొక కారు వచ్చి గేటుదగ్గిర ఆగింది. జ్ఞానప్రకాశం వెంటనే కారు దిగి "వచ్చా" రని యెదట వున్న యెలిజబెత్తుతో చెప్పి అక్కడికి కనపడు తూనే వున్న జకరయ్య కేసి మళ్ళాడు. హారన్ విని సుభద్ర లేచి నుంచుంది.

చూడగా చెల్లెలూ మరిదీని. ఆమె దుఃఖం ఆపుకోలేకపోయింది. కామేశ్వరమ్మ రెప్పపాటులో వచ్చి మీద వాలి "బతికున్నావుటే బుల్లక్కయ్యా?" అంటూ ఏడుస్తుంది. సుందర్రం వదిన గారి శరీరం మీద వున్న తట్లూ, కట్లూ చూసి నిర్విణ్ణుడై పోయాడు.

ఇంతలో జకరయ్య అక్కడికి వచ్చాడు. జ్ఞానప్రకాశం పరిచయం చెయ్యగా జకరయ్యా, సుందరమూ మందహాసంతో పరస్పరమూ వందనాలు చేసుకుని చెయ్యీ చెయ్యీ పట్టుకుని మర్యాద నెరుపుకున్నారు. యెలిజబెత్తు కూడా వచ్చి నమస్కరించగా జ్ఞానప్రకాశం వల్ల ఆమె ఫలానా అని తెలుసుకుని సుందరం ప్రతివందనం చేసి "మీ దంపతుల కరుణవల్ల మా వదినగారు బతికి మాకు తక్కారు. ఏం చేసినా మేము మీ రుణం తీర్చుకోలేము. మీ వుభయుల యోగ్యత విని మేము చాలా సంతోషించాము. మునిదంపతులవంటి మిమ్మల్ని చూసిన యీ దినం చాలా సుదినం" అని ప్రశంస చేశాడు. వారు గూడా అతని సౌజన్యాన్ని, హృదయవైశాల్యాన్నీ చాలా చాలా మెచ్చుకుని తమ సంతోషాన్ని వెల్లడించారు.

వీ రిలా మాట్లాడుకుంటూ వుండగా తలుచుకుని తలుచుకుని సుభద్రమ్మా, వినలేక వినలేక కామేశ్వరమ్మా పదినిమిషాల దాకా యేడ్చారు. తరవాత సూశేజంటు జ్ఞానప్రకాశాన్ని చాటుకు పిలిచాడు.

"వీ రెవరు ?"

"చెల్లెలూ మరిదీని"

"ఎందుకు వచ్చారూ ?"

"తీసుకు వెళ్లడానికి"

"ఏమిటీ— ?"

"ఇంకో అరగంటలో వెళ్ళిపోతారు"

"ఇంత తెలివి తక్కువవా డయిపోతున్నా డేమిటి జకరయ్యా ?"

"ఏం ?"

"అయిదు వందలు—కరుకులు—క్షణంలోనో, క్షణంలోనో చేతిలో పడిపోతాయి. ఎంతో కష్టపడి నేను పథకం పన్నాను ఏమైనా తెలవాలా వద్దా ?"

"ఏం చెయ్య మంటారూ ?"

"వెళ్ళనివ్వకండి. దారి కొప్పడతా డని చెప్పండి. భయపెట్టండి"

"మా కెందుకూ ఆగొడవ లన్నీని ?"

"మాంఛి ముహూర్తంలో వుంది పిల్ల. కృపానందానికి పెళ్ళి చేసుకోవచ్చు. సమయానికి పిలిచినట్టు వచ్చింది దేవుడే పంపించాడు. ఎందుకు చెడతారూ ?

"మనకి వద్దండి"

"ఏం ?......బ్రాహ్మ లంటే భయమా ?"

"ఎందుకూ ?"

"ఇంకేం మరి ?"

"ఆవిడ ఆపత్తులలో వున్నారు. నమ్మి మన యింటికి వచ్చారు. చెడు తలంపు తలిచా మంటే యేసు ప్రభువు మమ్మల్ని శిక్షిస్తాడు"

"కొంపతీసి దా డేమిటి ?"

"................."

"ఏం, నవ్వుతా వేం ?"

"ఇలా పోనివ్వండి"

"నేను మీ కోసమే చెబుతున్నాను"

"సలాం"

"వినరూ? జకరయ్యకి చెప్పవూ?"

"................"

"నాకు వచ్చీది కూడా చెడగొడుతున్నారు. బాగా ఆలోచించుకోండి"

"అలా వేళారా యెత్తు? క్షమించండి"

"ఏమంటావు?"

"సలాం, సలాం"

ఏజంటికి చాలా కోపం వచ్చింది. జ్ఞానప్రకాశం తిరిగి చూడకుండా చక్కాపోయాడు.

౧౦

ఎనిమిదయింది. ఇక బయలుదేరకపోతే సుందరం వేళకి కాలేజీకి వెళ్లలేడు. అత నెప్పుడూ వొక్క నిమిష మేనా వేళదాటి వెళ్ళి యెరగడు. ప్రతీ విషయంలోనూ అతను చాలా నియమంగా వుంటాడు. ఈసంగతి కామేశ్వరమ్మకీ, సుభద్రమ్మకీ గూడా బాగా తెలుసు.

అయితే ప్రయాణం ప్రస్తావన యెలా చెయ్యాలో సుందరానికి తోచలేదు చివరికతను కామేశ్వరమ్మ కేసి గంభీరంగా చూశాడు; కాని ఆమె కూడా యేమీ పాలుపోక అలాగే సుభద్ర కేసి చూసింది.

ఆచూపులో సుభద్రమ్మకి కూడా ఆసంగతి స్పష్టంగానే బోధపడింది. అయితే: ఆమె తనదే తరవాయి అని గ్రహించిన్నీ అంత వుపకారం—ప్రాణాలు నిలిపిన—తల్లినీ తండ్రినీ వెంటనే విడిచి వెళ్లడం యెలా గని ఆందోళపడుతూ తానుగూడా చెల్లెలి కేసీ, మరిది కేసీ అలాగే గంభీరంగా చూసి, చివరికి యెంతో సంకోచపడుతూ మొదట జకరయ్య కేసీ, తరవాత యెలిజబెత్తు కేసీ బెదురుతూ బెదురుతూ చూసింది.

ఆదంపతులు కూడా వీ రంతా ప్రయాణం కోసం తొందరపడుతున్నా రని గ్రహించారు; కాని యెలిజబెత్తు యేటూ తోచక జకరయ్య కేసి చూడగా జకరయ్య అంటున్నాడు.

"మీ వుద్దేశం తెలిసింది. మా స్వాధీనంలోకి వచ్చిన ప్రతీవారికీ మత దీక్ష యివ్వా లని మాకు మిషనరీలు చేసిన ఆజ్ఞ. దా న్ననుసరించి యిప్పుడు అమ్మాయికి మతదీక్ష యివ్వడానికి మా కేమీ ఆక్షేపణ లేదు; కాని మాకా సంకల్పం కలగలేదు. ఘన్త పూర్వాచారపరాయణులైన వైదికబ్రాహ్మల యింటి వితంతుయువతి మాయింటికి రావడమూ, మాయింటో భోజనం చెయ్యడమూ—యివి సామాన్యవిషయాలు కావు. ఇంత జరిగిన తరవాత నిజానికిక క్రైస్తవ మతదీక్ష పుచ్చుకున్నా వొకటే, లేకపోయినా వొకటే. పైగా మీరు బ్రహ్మమతం మీద అభిమానం—"

"ఇదివరకే అభిమానం. ఇక ఆమతదీక్ష పుచ్చుకోకుండా క్షణం వుండను. నిర్దోషురాలైన స్త్రీ విషయంలో యింతింత దారుణాలు తలపడానికి అవకాశ మిచ్చే యీ జర్జరితమతంలో యిక క్షణమేనా వుండలేను నేను. బ్రాహ్మణమతంలో మా వదినగారికి చోటు చాలదు. ఆమెని విడిచి మే ముండలేము. పైగా: నా బోధనల వల్లనే ఆమెకి దృష్టి మారింది. కొత్త ఆశలూ, కొత్త సంకల్పాలూ కలిగాయి. అందేతనే ఆమె యింతింత బాధలనుభవించవలసివచ్చింది. నిర్దోషురాలి కిలాంటి అవస కలిగించినందుకు ప్రాయశ్చిత్తంగా కూడా నేను వెంటనే బ్రహ్మమతదీక్ష పుచ్చుకోవలసి వుంది"

"అయితే మరీ సంతోషం. సత్యం బోధపడిన తరవాత మీ వంటి విద్యార్థులు చెయ్యవలసిన పనే చెయ్యబోతున్నారు మీరు. మిమ్మల్ని ఆదర్శంగా పెట్టుకుని మీతోటివా రంతా ప్రవర్తిస్తే యెంత బాగుండును?...ఇక ఆలస్యం చెయ్యను.

క్షిస్తున్నాడు. జమీందారు ఆప్రశ్నలు వింటూ ఖిన్నుడై దగ్గిరే వున్నాడు. దివాను కూడా నాలుగు గజాల దూరంలో నుంచునే వున్నాడు; కాని సుభద్ర యిదేమీ చూడలేదు. ఏమీ జంకనూ లేదు. వెనక్కాలే వెళ్ళి, యెడం చెయ్యి తండ్రి మెడ మీద ఆనించి, మొగానికి మొగం తగిలేటట్టు ముందుకి వంగి "పుస్తకాలు వచ్చాయి నాన్నారోయ్" అంటూ గిల్టు అక్షరాలతో మిలమిల మెరిసిపోతూ వున్న పుస్తకాలు చేతిలో పెట్టింది.

సుభద్ర వుత్సాహమూ, ఆపుస్తకాలూ చూశాటప్పటి కతనికి కూడా బ్రహ్మానందం అయింది. అతను కేసు సంగతి మరిచిపోయాడు. "అప్పుడే వచ్చాడుటమ్మా రామచంద్ర?" అన్నాడు. అంతే. మరేమీ—అధరస్పందమైనా చెయ్యలేదు. దాసీలకి—దివానుకి—చివరికి జమీందారుకి కూడా యేమీ చెప్పలేదు. గభీమని లేచి కిందికి చక్కాపోయాడు. "గిల్టు అక్షరాలు—మనం చెప్పలేదు కాదుటండీ నాన్నారూ! ఎంత ముద్దుగా వున్నాయో!" అంటూ సుభద్ర కూడా వెంబడించింది.

* * *

"అనకూడదు కాని సూరయ్యగారే సాఫుగా రాయడం వస్తే—"

"ఆయనే సాఫు రాయడం వస్తే చెన్నాపట్టం వెళ్ళడమూ, అచ్చు వేయించడమూ, నువ్వు ఆయనికి పళ్ళూ అవీ పంపడమూ—యివన్నీ యెందుకు వస్తాయీ?"

"అవునేవ్!...కాని సూరయ్యగారికి పళ్ళు పంపిస్తునేం? నాన్నారు అలాంటి బట్ట లిస్తురేం?

"ఆయన్ని చూస్తే నాకు వొళ్లు మండిపోతుంది—"

"నాకూనూ. వొక కథ రాయడానికి పది రోజాలు పట్టీది. "ఆఫీసు పనులు తేలడం లే" దని నాతోనూ, "అమ్మాయిగారి కథలు రాయడంతో సరిపోతోం" దని నాన్నారితోనూ చెబుతూ యింటో కూచుని—"

"అంత మేలు చేశాడు కదా మరి రామచంద్రానికి నువ్వేం బహుమతీ చేస్తావూ?"

"అవునే పిన్నోయ్! నాకు తోచిందే కాదు చూశావా?...ఏం చెయ్యమంటావే?"

"నా కేం తెలుసునే!"

"వులకం"

"కా కేమమ్మా? నువ్వు కథలు రాయడమూ, అతను దిద్దడమూ, యిద్దరి వుద్దేశాలూ కలవడమూ—"

"బహుమతీ మాట చెప్పమంటే దండకం విడేస్తా వేమిటే"

"నే నేం చెప్పగలనే? నీ మనస్సులో యేం వుందో—"

"అసలు నాకు తోచందే టే".

"కభుర్ల కేం లే? నిజంగా యేమీ లేకపోతే కోరి అలాంటి బట్టలు నీ చేతుల్తో యివ్వగలవా? చెన్నాపట్టం వెడితే పదిరోజుల్లో తిరిగి వచ్చేవాడికి వూరగాయీ, బత్తాయిలూ పంపించగలవా? పైగా వుప్పాడ కండువాల కోసమూ, రిస్టువాచీ కోసమూ, రవ్వల వుంగరం—"

"ఆమాట నువ్వు తెచ్చావు"

"నేను తెస్తే మాత్రం, నువ్వు విడిచిపెట్టావా యేమిటి?"

"......................"

"పైగా అతనింటికి వచ్చేదాకా నీకు నిద్రాహారాలు సయించాయా?...నే నెరగ ననుకున్నావేం?"

సుభద్ర మాట్టాడలేదు. మొగం కూడా పైకెత్త లేదు. అవంచి వున్న మొగమ్మీద ఆనందమూ, ఆనందం మీద సిగ్గూ, సిగ్గుమీద మాన్పాటూ ఇట్టిట్టే అలుముకు పోయాయి.

౧౧

పంతులయ్య మేడమీద దక్షిణపు వసారాలో పచారు చేస్తూ పత్రిక చదువుకుంటూ వుండగా

ముసిముసి నవ్వులు నవ్వుతూ వచ్చి జానకమ్మ పత్రిక పుచ్చుకుంది.

"ఏం కథా?"

"అమ్మాయికి సమ్మంధం చూడండి"

"ఎంచేతా?"

"ఈడు వచ్చింది కాదూ?"

"అయితే నువ్వే చూడరాదూ?"

"అన్నట్టు—మన మేమీ కష్టపడనక్కర్లే దా విషయంలోను"

"అంటే?"

"నా రండి తెలుస్తుది?"

ఇద్దరూ వుత్తరపు వసారాలోకి బయలుదేరారు. పంతులయ్యకి జానకమ్మ చూపించబోయింది అర్థం అయింది; కాని వరు డెలాంటివాడో అని కంగారు పట్టుకుంది మధ్యదారిలో జానకమ్మ "మీ రేమీ మాట్టాడకండేం" అంటూ చేత్తో కూడా నిషేధించింది; కాని అత నంతకి ముందే నిరవు డయిపోయాడు. చివరి కిద్దరూ వసారా గదిలోకి వెళ్లి కిటికీ దగ్గిర నుంచున్నారు.

కిందికి చూడగా తోటలో పొగడచెట్టుకింది అరుగుమీద తువ్వాలు పరుచుకు పడుకుని రామచంద్రం యేదో పుస్తకం చూసుకుంటున్నాడు. సుభద్ర సీమచింత కట్టవ చాటున నక్కి వుండి అతన్ని తొంగితొంగి చూస్తూ వుబలాటపడిపోతోంది.

పంతులయ్య పెద్ద నిట్టూర్పు విడిచాడు.

"ఏ మంటావ్?"

"అతను చెన్నాపట్టం వెళ్లింది మొదలు అమ్మాయికి నిద్ర లేదు. హారం లేదు. మరి ప్రపంచకం కూడా లేదు"

"అతనికి తెలుసునా?"

"వోత్రి అమాయికుడు. ఏమీ యెరగడు పాపం!"

"ఏమిటి చెయ్యడం?"

"ఈడూ జోడూనూ. ఆపైని అమ్మాయి తల్లడించి పోతోంది; కాని—"

"ఇంకా యేమిటి?"

"మీ దర్జాకి—"

"నిజమే. మనం ఐశ్వర్యవంతులమే; కాని అతని భావోన్నతి యెదట మన దర్జా యేపాటిది? అమ్మాయికి తగిన వరుడు అతను తప్ప భూమ్మీద మరొకడు లేడు. ఈశ్వరు డత న్నిందుకోసమే మన యింటికి తీసుకువచ్చాడు. అతన్ని పెళ్లి చెయ్యడం కంటే అమ్మాయికి నేను చెయ్య గలది మ రేమీ లేదు!"

"....................."

"నే నీ పని చెయ్యకపోతే అమ్మాయికి అపకారమూ, దాని తల్లికి ద్రోహమూ, చేసిన పాపాన పోతాను"

"....................."

"అమ్మాయికి పెళ్ళియీడు వచ్చిం దని. అదొక యింటిది కావడం కోసం అటమటించిపోతూ వుంటుం దని యెరుగుదును. అయితే: అమ్మాయి దృష్టి యెలా పోతుందో, యెలాంటి వాడు నా సంపత్తికి వ్యవహర్త అవుతాడో అని నేను చాలా బెంగపెట్టుకున్నాను; కాని నా బెంగ తీరడమే కాదు; తపస్సు ఫలించింది"

జానకమ్మ మాట్టాడలేదు. రెప్పకూడా వెయ్యలేదు. పంతులయ్య మొగమ్మీద వొకటే చూపు—

"ఏ మంటావ్?"

"....................."

"ఏమిటి చూస్తున్నావు?"

"దేవతాకళ"

"ఎక్కడా?"

"మీ మొగమ్మీద"

పంతులయ్య అత్యానందంతో ఆమె యెడమ బుగ్గమీద యిట్టే అన్నాడు.

"మీరు వేసే ప్రతీ అడుగులోనూ, చేసే ప్రతీ పనిలోనూ,—వుచ్చరించే ప్రతీ అక్షరంలోనూ అంతు లేని ఔదార్యం కనపడుతూనే వుంది. మీ స్వరూప మంతా నా కిప్పుడు బోధపడ్డ ట్టెప్పుడూ బోధపడలేదు. లోకంలో యే సంపన్నుడూ, యే పండితుడూ, యే భోగీ, యే దాతా, యే తంత్రీ కూడా మీ కాలి గోటి కయినా పోలరు" అని చెబుతూ ఆమె అతని వక్షస్థలమ్మీద తన మొగం ఆనించుకుని పరవశురా లయిపోయింది.

హరిజనోద్ధరణపు ఆవశ్యకము

కొమాండూరి శఠకోపాచార్యులుగారు ఎం. ఏ. బి. ఎల్.

హరిజనులు హిందువు లగుటయే గాక చాతుర్వర్ణ్యములో నాలుగవవర్ణమం దంతర్భూతు లగు నిమ్న జాతివా రని తోచుచున్నది. * వారి అస్పృశ్యత యెప్పు డేరీతిగా నారంభించినదో స్పష్టముగా తెలియుట లేదు. మహమ్మదీయులు క్రైస్తవులు మొదలగు అన్యజాతీయులు హరిజనుల నస్పృశ్యులుగ నెంచుట లేదు. హిందువులలోనే మిగిలినవారు వీరి నంటరానివారుగ నెంచుచున్నారు. అంతే గాక మన రాష్ట్రపు గ్రామములయందు పెక్కుచోట్ల మనవారు హరిజనులను సమీపించరానివారుగను, చెప్పరానివారుగ నెంచుచున్నారు. ఆర్థికముగను, సాంఘికముగను గూడ వీరి దుస్థితి వర్ణనాతీతము. ఇందుకు చాల వఱకు వీరి అస్పృశ్యత కారణము. జన్మచే అనువంశికముగ నేజాతిని అస్పృశ్యముగ నెంచుటకు వేదములు భగవద్గీత మొదలగు మన మూలగ్రంథములలో నాధారము కనబడదు. ఈ హరిజనులే హిందూమతమును వదలి తురకలో క్రైస్తవులో అయినచో, మన హిందువు లందరము వారి నస్పృశ్యులుగను, శూద్రులుగను చూడక మిగిలిన మహమ్మదీయులతోను, క్రైస్తవులతోను సమముగ గౌరవింతుము. అందుచే వారి ఆర్థికస్థితిగూడ బాగుపడుచున్నది. హిందూజాతి భద్రత గోరువారందరు హరిజనులను వారి ప్రస్తుతహీనస్థితినుండి యుద్ధరింప బూను టవసరము. వారి నన్యజాతీయుల కన్నను, మృగముల కన్నను గూడ మిక్కిలి నీచముగ జూచుట మిక్కిలి అన్యాయ మని మన పెద్దలు చాలమంది అంగీకరించుచున్నారు. చిరకాలమునుండి మహనీయు లగు అనేకహిందూమత సంస్కర్త లందుకై ప్రయత్నించిరి. ఇటీవల గాంధిగారు కాంగ్రెసు కార్యక్రమములో రాజకీయముల కన్న గూడ దీనికి ప్రాధాన్య మిచ్చిరి. అందుపైన రాజకీయముగ జాతీయవాదులై కాంగ్రెసు అభిమానులుగా నుండిన వారిలో గూడ చాలమంది సనాతనులు దీనికి వ్యతిరిక్తులై, అందుకు గాంధీజీ మొదలగువారి ననేకవిధముల దూషించిరి. అందుచే ప్రబలిన ద్వేషోద్రేకమే గాంధీజీపై ఇటీవల బాంబు లేయబడుటకు కారణ మయ్యె నని చాలమంది ♦ యూహించుచున్నారు. హరిజనుల నుద్ధరించుట, కొంతవర కస్పృశ్యతా నివారణము మంచిదే గాని అది ప్రస్తుతావసరము కాదని గాంధిగారు మొదలగు కాంగ్రెసునాయకులు కేవలరాజకీయకార్యక్రమమే యిప్పుడు బాగుగా నడిపించవలెనని అందుచేతనే స్వరాజ్యము లభించగల దని ఆపైని వారి జనోద్ధరణము సావకాశముగ వీలగునంతవఱకు జరుపవచ్చు నని తీవ్రసనాతనుల నాయకులు కూడ చెప్పుచున్నారు. అఖిలభారతవర్ణాశ్రమధర్మసభాధ్యక్షులకు అవధానిశిరోమణి శ్రీ కాశీ కృష్ణాచార్యులవారును యిట్టి అభిప్రాయమునే తెల్పిరి. కాని విమర్శించుచో ఈ అభిప్రాయము పొరబా టని తోచును.

హరిజనోద్ధరణము వెంటనే జరుగనిచో జాతీయవాదులు గోరు నిర్మాణకార్యక్రమము అన

* ప్రబుద్ధాంధ్ర యీ సాలు జూను నెల సంచికలో "హరిజనులజాతి" అను శీర్షికవ్యాసముచూడుడు.

♦ ఈ బాంబు ప్రయోగమువలన తీవ్రముగా గాయపడిన శ్రీ ఎల్. బి. భోపేత్కరుగారు ఈ ప్రయోగము గాంధిగారి నిమిత్తము ఉద్దేశింపబడలేదని మాలవ్యాగారితో చాల దృఢముగా చెప్పినట్లు యిటీవలి పత్రికావార్తలు చెబుతున్నవి. (సంపాదకుడు).

50

గా ఖద్దరువ్యాప్తి, త్రాగుడునివారణ, హిందూముసల్మానుమైత్రి, స్వదేశి మొద లగునవి సరిగా నెరవేరునా? ఖద్దరు జనసామాన్యమున వ్యాపించకపోవుటకు మూలకారణము అవి మిల్లుబట్టలకన్న చాల ప్రియముగ నుండుటయే. ఉన్నతజాతివారు నూలు తీసి బట్టలు నేయుటకు వారు సంపాదించు కూలి రేటు కిట్టుబాటు గాదు. నిరాధారు లగు ఆది హిందువులకు మాత్రము గిట్టును. పూర్వకాలమందు అన్నిప్రాంతములందును హరిజనులు చాల ప్రశస్తముగ నూలు తీసి నేయుచుండిరి. ఇప్పటికిని గుంటూరుజిల్లాలోను పశ్చిమాంధ్రమందును కొన్ని యితరస్థలములందును కూడ మాలలు నేసిన బట్టలను తక్కిన జాతులలో చాలమంది ఉపయోగించుచున్నారు. రోజు కణా కూలి కూడ దొరుకక గుడిసెలలో దిక్కులేక యున్న వీరికి ఆయా గ్రామములు దూది నిచ్చినచో వీరును వీరి పిల్లలును కావలసినంత నూలు బట్టలు మిల్లునూలు బట్టలకన్న చవుకగా తయారుచేయుదురు. అందుచే వారికి కావలసిన గంజి అన్నము దొరికి సంతోషించి కృతజ్ఞులగుదురు. మఱియు చెప్పులు మొదలగు తోలుపనులు, వడ్రము, కమ్మరము మొదలగు పనులు హరిజనులే పూర్వము చాల చవుకగాను, అతి నిపుణతతోడను చేయుచుండిరి. కాలక్రమమున వారితో సంపర్కము మనకు పూర్తిగ వదలిపోయి వారు కూడు లేక మలమల మాడుచుండ మన మన్యదేశవస్తువుల నువాడుచున్నాము. కూలిజాతిలో ముఖ్యులగు నీ హరిజనులను దగ్గిర దీసి విద్య గరపి వారిచే చవుకగా మనకు వలయు బట్టలను, చెప్పులను, యింకను యితరవస్తువులను మనము తయారుచేయించుకొనవచ్చును. ఇందు కస్పృశ్యత తొలగి హరిజనులలో పరిశుభ్రత ప్రాథమికవిద్య వ్యాపించుటయే గాక వారికి మిగిలిన హిందువులందు విశ్వాసము కలుగుట చాల అవసరము. వారిని దూరములోనే యుంచి వారి బ్రతుకును గూర్చి మనము కేవల మశ్రద్ధగా నుండు నంత కాలము హరిజనుల పరిశుభ్రులై, స్పృహహీనులై దిక్కు లేక యుందురు. గ్రామపునర్నిర్మాణమునకును హరిజనోద్ధరణ మవసర మని పైసంగతుల వల్లనే స్పష్టము కాగలదు. కోట్లకొలది నిరాధారులుగ నున్న హరిజనుల చవుక కూలివలన మిగిలిన జాతి పారిశ్రామికులుకూడ యితరవస్తువులను చవుకగా చేయకలుగుదురు. అందుచే గ్రామములందు నశించిన వృత్తు లన్నియు తిరిగి యేర్పడును. మద్యపాన నిషేధము జయప్రదముగుటకు అజ్ఞానాంధులై కేవలము మూఢు లగు నీ అస్పృశ్యుల మనవద్దకు రానిచ్చియు గూడెములకు బోయియు వారికి తగు బోధ చేసి వారి నట్టి మూఢత్వమునుండి మరలించు టవసరము. త్రాగుడందరి కన్న మాలమాదిగలలోనే యెక్కువగా వ్యాపించి యున్నది. వారు శుభాశుభ కార్యములందును, కులసభలందును, అమ్మవారి ఉత్సవములందును విశేషముగ త్రాగుదురు. త్రాగుడు అమ్మవారికి ప్రీతికర మనియు, మధుసేవ జరుగనిచో గ్రామదేవత కాగ్రహము కలుగు ననియు వారి నమ్మిక. మతాచార సంబంధము లగు యీ మూఢవిశ్వాసములను అజ్ఞానమును తొలగించుటకు హిందూధర్మము మద్యపానమును గాక తన్నిషేధమునే బోధించు ననియు క్షుద్రదేవతారాధనము, మృతజంతు మాంసభక్షణము, గోమాంసాశనము కూడ దనియు వారికి బోధింపవలసి యున్నది. మతపీఠాధిపతులును. హిందూసనాతన ధర్మనాయకులును, ఇట్లు చేయుచో హరిజనులలోనే గాక వీరితో కలిసి త్రాగు చాకళ్లు మొదలగు వారిని గూడ బాగుచేసి హిందూమతము నుద్ధరింప కలుగుదురు. కాని వారి బాధ్యత నెంతమాత్రము నెరవేర్చుట లేదు. విశేషముగ త్రాగు ఆరుకోట్ల హరిజనుల గూడెములపైపైనను చూడక వారి సంస్పర్శను విషతుల్యముగ జూచుచు మనలో మనము త్రాగుడు కూడదని యెంత ప్రచారము చేసినను మద్యపాన

నిషేధ మెన్నటికిని జయప్రదము కానేరదు. ఈఆదిహిందువుల త్రాగుడు, అమ్మవారి జాతరలు మొదలగు దురాచారములు వారినే గాక హిందూ జాతి నంతను గూడ గుల్లచేయుచున్నది. బ్రాహ్మణులుగూడ ఇందుకు లోనగుచుండుట శోచనీయము. పునాది దుర్బలమై గుల్లయగుచుండ దాని నశ్రద్ధ చేసి భవనమునకు పైఅంతస్తులు గట్టి అలంకరించుటచే లాభ మేమి? ఎప్పుడో ఒకసారి ఆభవన మంతయు కూలక తప్పదు. ఆర్థికముగను, సాంఘికముగను (కొందరు నమ్మకపోయినను రాజకీయముగను గూడ) ఈ ఆదిహిందువులే హిందూసంఘపు పునాది. వారు నశించినచో హిందూసంఘ మంతయు నాశనమగును. మరియొక విషయము. ఈ ఆదిహిందువులను మహమ్మదీయులు క్రైస్తవులు తమ మతము నందు చేర్చుకొనుటకు ప్రచారము చేయుట, ఆ మాలమాదిగలు తమకు అందుచే నస్పృశ్యతానివారణ కలిగి ఆర్థికసాంఘికలాభములును కలుగు నని ఆమతములలో కలియుట, అంతట నాక్రైస్తవ మునల్మానుప్రచారకులకు మన ప్రచారకులకు ఘర్షణ విరోధములు కలుగుట పరిపాటి అయినది. హిందూసంఘము మన దేశమున ప్రస్తుత మధిక సంఖ్యాకము. హరిజను లామతములలో చేర్చుకొన బడినచో హిందువు లల్పసంఖ్యాకులై దేశమున ఇప్పుడున్న పలుకుబడి కూడ లేకుండ పోవును. హిందూదేశములోనే హిందూమతము క్రమముగా క్షీణించిపోవును. ఈవిపత్తు రాకుండుటకైనను హరిజనుల అస్పృశ్యత తొలగించి కలహబీజ మగు మతాంతరప్రాప్తి వారింపనిచో వారు నిగాశులై హిందూమతము వీడుటయు, యితరమతస్థులు మనము “మాపిల్లంటే మాపిల్ల” అని వారికై తగువు పడుటయు తప్పదు. అందుచే హిందూసంఘటన మునకే గాక హిందూమునల్మానుక్రైస్తవసఖ్యతకు కూడ అస్పృశ్యతానివారణ మవసరము. మన దేశపు యితరులతో పాటు హిందువులలో గూడ నూటికి ౯౩ రు నిరక్షరకుక్షులు. మన దేశము చైనా తప్ప తదితరదేశస్థు లందరు సాధారణముగా నూటికి ౯౦ మందివరకు విద్యావంతులే. మన జన సామాన్యమునకు ప్రాథమికవిద్య అయినను లేనందున సంఘము క్షీణదశలో నున్నది. జనుల ఆరోగ్యము, గ్రామపారిశుధ్యము పత్రికల ప్రచారాధిక్యము, గ్రంథాలయవ్యాప్తి, దురాచారనివారణము, యిట్టి దేశహితకరోద్యమముల కన్నిటికి పామరజనులలో ప్రాథమికవిద్యావ్యాప్తి అత్యవసరము. హిందువులలో వివిధకులము లన్నిటికన్న హరిజనులే అధికసంఖ్యాకులు. వారిలోనే విద్య బొత్తిగా శూన్యము. మాలపల్లెల వైపు చూడక మన పాఠశాలల లోనికి వారి పిల్లలు వచ్చిన కంటగించుకొనుచు వారి విద్యకై మనము శ్రద్ధ వహించనంతవరకు జనసామాన్యపు నిరక్షరత అజ్ఞానము పోవు. ఈమాలమాదిగల దురాచారములు, మౌఢ్యము నివారణ చేయనందున తక్కిన జాతులకు గూడ నిది వ్యాపించుచున్నది ఇట్లు గ్రామపునర్నిర్మాణము సాంఘికాభివృద్ధియే గాక రాజకీయనిర్మాణ కార్యక్రమము గూడ జయప్రద మగుటకు ముందుగా ఈ ఆదిహిందువుల నుద్ధరించి వారి నధోగతిపాలు కాకుండ కాపాడుట అవసర మని తోచుచున్నది.

ఒక పతివ్రత

కొడవటిగంటి కుటుంబరావుగారు

ఇది నా జీవితంలో విపరీతమైన సంఘటన. ఇందులో నా తప్పేమీ లేకపోయినప్పటికీ, ఇది నా జీవితానికి కళంకం తెచ్చింది. ఇది జరిగి ఇప్పటికి పది సంవత్సరాలయింది: దీని ఫలితం ఇంకా నన్ను వెంటాడే, నాకు నిద్రాహారాలందూ ఇతర ఐహికవాంఛలందూ విముఖత్వం కలిగిస్తున్నది అన్నిటికన్నా నన్ను బాధిస్తున్నది స్త్రీవైముఖ్యం. నన్ను ప్రకృతి బ్రహ్మచర్యానికి నిర్దేశించలేదు. కాని ఇంతకాలం నించీ చేస్తున్న పనే అది. దాపరికం ఎందుకు? నేను ఆడదాన్ని చూసి పూర్తిగా చెదిరిపోయినాను! నా బెదురు పోగొట్టగల స్త్రీజాతి లేకపోలేదు; కాని ఆసందుల్లో అడుగు పెట్టటానికైనా నాకు నైతికమైన గుండె నిబ్బరం లేదు. నేనట్లా పుట్ట లేదు.

ఈఅనుభవం పగవాడికైనా వద్దు!

నేనిది మొదటిసారి కాదు రాయబూనటం. బిడియం విడిచి నా సంగతి నేను రాసుకోగలగటానికి శక్తి ఇచ్చాడు కాడు భగవంతుడు. అట్లా రాసి సంతోషించే మనస్తత్వం ఆభావకవులకే అవగతం కావాలి. కాని జరిగిందంతా ఒక్కసారి లోకానికి వెల్లడి చేసేస్తే నా మనస్సు చాలా తేలికవుతుందని అంతరాత్మ చెబుతున్నది. చేస్తున్నాను నా పదమూడో ప్రయత్నం! తగిన మనోబలం ఇవ్వమని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

నేనింకా బాల్యదశలో ఉండగానే, నాకింకా పాతివ్రత్యమంటే ఏమిటో తెలీక మునుపే, నాభార్య పతివ్రత కాబోతుందని ఎరుగుదును. నాజాతకం రాసినాయన ఆముక్క రాశాడు! అప్పటికింకా పుట్టని పిల్లనప్పుడే పవిత్రంగా భావించుకోటం మొదలుపెట్టాను!

మా నాన్న చేసిన అపాత్రప్పనుల్లో నావివాహం ఒకటి. అతి స్వల్పవిషయాల కోసం ఉభయపార్టీలవారూ అతిదారుణంగా దెబ్బలాడుకున్నారు. అప్పటికి మా నాన్న ఇంచుమించుగా నాకు రెట్టింపు వయసువాడు, మా మామగారు నాకు మూడింతల వయసూ, పదింతల అనుభవమూ కలవాడు? అనుభవం వల్ల కూడా అజ్ఞానమూ అవివేకమూ నశించవేమో ననుకున్నాను.

ఈ తగాదాలు వైరంగా పరిణమించి నా మనసును ఆందోళనపెట్టినై. వివాహానంతరం ఆరెండు మూడు సంవత్సరాల. కాలం అచ్చట్లూ ముచ్చట్లూ లేకుండా పోవటమే కాక, నాపతివ్రతను నేను ఏపండగమిషమీదనో చూసుకోటం లేకపోగా, ఆ రెండు మూడు సంవత్సరాల గడువును అతీగతీ లేకుండా పొయ్యేటట్టూ, నేనేదైనా తెగబడి చేసే దాకా, నలుగురయ్యిన వాళ్లకూ ఎదురుతిరిగే దాకా నాకూ నాభార్యకూ ఎడబాటు తప్పనట్టూ కనిపించింది. పూర్వంమల్లే నే ఇక ముందు కూడా నలుగురి చేతా బుద్ధిమంతుడనిపించుకోవాలంటే చచ్చువెధవగా ఉండటం కూడా తప్పదని కూడా తేలిపోయింది. ఈ విధంగా నా అభిప్రాయాలు మారిపోతున్నప్పటికీ, అదివరకు మంచిగా కనపడ్డదిప్పుడు చెడుగా నిర్ధారణ అవుతున్నప్పటికీ నాప్రవర్తనలో ఎటువంటి మార్పూ చేసుకోలేకపోయిన అసమర్థుణ్ణి నేను అదే పనిగా పెట్టుకుని ఇంతకాలం నించీ నాలాంటి అసమర్థులను ప్రతిరోజూ లెక్కలేనంతమందిని కనిపెడుతున్నాను. మన సంఘం యావత్తూ నావంటి అసమర్థులతో నిండినట్టు కనిపిస్తుంది. మన అభిప్రాయాలకు అనుగుణ్యంగా ప్రవర్తన మార్చుకుని అసమర్థత దులిపేసుకోటం మాటలతో సులభంగానే అవుతుంది కాని

ఆచరణలో పెట్టటానికి ఎంతో బుద్ధిబలమూ ఆత్మగౌరవమూ కావాలి. అంతే చెప్పటానికీ చెయ్యటానికీ భేదం. చెప్పటం బాగా చాతనయినవాళ్లు ఏ కారణంవల్లనో బుద్ధిబలానికీ ఆత్మగౌరవానికీ ప్రాముఖ్యత ఇవ్వకుండా ఉంటున్నారు. బాగా ఆలోచించగా మన జాతి వెనకపడి ఉండటం ఇతరజాతులకన్న మనం తక్కువ తెలుసుకున్న వాళ్లం కావటం కాదని తోస్తున్నది. మన జాతికి ముఖ్యంగా . ఆత్మగౌరవం ఏనాడు పూర్తిగా కలుగుతుందో ఆనాడు మనం ఇతరజాతు లన్నిటినీ మించి ముందు పోతాం అంత దాకా మనకు కావలిసిన వాళ్లు చెప్పగలవాళ్లు కానే కాదు; చెయ్యగలవాళ్లు! ఈలోపుగా మన సారస్వతం ఎంత అభివృద్ధి చేసుకున్నా అది ఇతరజాతుల మెప్పు సంపాదిస్తుంది కాని మన కేమీ ఉపకరించదు!

నాకు పార్వతీశంతో పరిచయం కలిగింది గుంటూరులో. నా కక్కడ తాలూకా ఆఫీసులో ఆరునెల్లు ఆక్టింగ్ గుమాస్తాగిరి ఒక పెద్దమనిషి సిఫారసు మూలాన లభించింది. ఆఫీసుకూ హోటలుకూ కూడా దగ్గరలోనే ఉండే టట్టు ఆరండల్ పేట పోస్టాఫీసు చుట్టుపక్కల గది కోసం వెతకటం ప్రారంభించాను. నాకు నచ్చిన గది ఒకటి కనపడ్డది. గది చాలా విశాలంగా ఉండటమే కాక అద్దె నాలుగు రూపాయలే కావటం ఒకటీ, ఇంట్లో ఒక వృద్ధురాలూ ఆవిడ కుమారుడూ (కాలేజిలో చదువుకుంటున్నా డప్పుడు) మాత్రమే ఉండటం వల్ల బావికీ దొడ్డికీ స్వేచ్ఛగా వెళ్లుతుండటానికి ఆటంకం లేకపోవటం ఒకటీ, గది వాకిలి ఇంటివారితో సంబంధం లేకుండా వీధిమీదికి ఉండటం ఒకటీ నాకు చాలా తృప్తికరంగా ఉన్నై. కాని ఇంటావిడ ఒక కండిషను పెట్టింది.

"రేపుదయం ఏమాటా చెబుతా న్నాయనా! పది పన్నెండు రోజుల కింద ఇంకో అబ్బాయి వచ్చి ఈరోజు సాయంతరం లోపలే ఏమాటా చెబుతాను; అంత దాకా ఎవరికి మాట ఇవ్వవద్దని చాలాచాలా చెప్పి పోయినాడు. మళ్లీ కనిపించలేదు. బహుశా రా డనే తోస్తుంది. మరి అగడువు లోపల నీకెట్లా మాట ఇవ్వను?" అన్న దావిడ.

"సరే లెండి! ఫరవా లేదు!" అని నేను నిశ్చింతగా వెళ్ళిపోయినాను. ఆకుర్రవాడు మళ్లీ రావచ్చాడా అని నా ధైర్యం. మర్నాడు నేను వెళ్లేటప్పటికి గది ఆక్రమించబడి ఉంది!

నాకు పూర్తిగా ఆశాభంగమయింది. ప్లాటుఫారంమీద అడుగు పెడుతూండగా రైలు సాగిపోయినవాడు పోతున్న రైలువంక నిరర్థకంగా చూస్తూ నిలబడ్డట్టు నేను నిష్ప్రయోజనంగా కొంచెం సేపు ఆ గదిముందు తారట్లాడాను. ఇంతలో అతను నన్ను చూసి లోపలికి ఆహ్వానించి సంభాషణలో దించి జరిగిందంతా తెలుసుకున్నాడు. ఆకాస్త సంభాషణలోనే నా కతని మీద మంచి అభిప్రాయం ఏర్పడ్డది. మొదటి సంగతి అతను స్నేహపాత్రుడు. ఎక్కడికి పోయినా ఎక్కువ ప్రయత్నం అవసరం లేకుండా గౌరవం పొందగలవాడల్లే కనిపించాడు. అతని వయస్సు అప్పటికి ఇరవై రెండు దాటి ఉండదు. నాకంటె రెండు సంవత్సరాలు పెద్ద. అంతే! అయినా అతని ముందు నాకు నేనే వృద్ధుణ్ణనిపించాను అతను ఆరోగ్యంతోనూ బలంతోనూ పొంగిపోతున్నాడు. అతని మెడ చాలా బలిష్టంగా ఉంది. అతను వేసుకున్న మల్లు లాల్చి అతని దండలనూ ఛాతీని దాచలేకుండా ఉం దన్న మాట. అతని నడుము ఇరవై నాలు గంగుళాలు మించి ఉండదు. అసలిన్ని బాహ్యలక్షణాలు వర్ణించటం అనవసరం. ఇద్దరు మనుష్యులకు పరస్పరాకర్షణ కలగటానికి భాషాతీత మైన విషయా లనేకం ఉంటై.

ఒక్క నిమిషం లోపలే మా సంభాషణ అయిపోయింది. పైన మరో అరనిమిషం అనవసరంగా

కూర్చుని ఒక నిట్టూర్పు విడిచి లేచాను. గది వెతుక్కోవలసిన పని అట్టే ఉంది మరి. నేను కాళ్లీడ్చుకుంటూ గుమ్మందాకా పోయిన తరవాత అతను నన్ను పిలిచి అనుమానిస్తూ ఇద్దరం ఒక గదిలో ఉండటం అసంభవమౌతుందా అన్నాడు. నాకా ఆలోచన తట్టనే లేదూ! లోపల ఉత్సాహం అణుచుకుని ఎందుకవుతుందన్నాను. ఒకరి తరవాత ఒకరు లాభాలు కూడా కనిపెట్టాం.

“అద్దె రొండు రొండు రూపాయలే అవుతుందీ!”

“అవును. ఒకళ్లకొకళ్లు తోడుగా ఉంటాం!”

“అవును. కంపెనీగా ఉంటాం—ఒంటరిగా బిక్కు బిక్కుమంటూ ఉండేకన్న!”

“గది ఒకళ్లకే చాలా ఎక్కువ కూడానూ!”

ఆసాయంత్రం నేను కూడా ఆగదిలో ప్రవేశించాను.

పార్వతీశం నాకు కొత్తరకం మనిషి. కొత్త అనుభవం కూడానూ!

అటువంటి మనిషిని నేనంతకు పూర్వం గాని తరవాత గాని చూడలేదు. అతనితో పరిచయం కలుగుతున్న కొద్దీ అతనిలో నావంటివాడు నేర్చుకోవలసిన విషయాలు చాలా కనపడ్డై. ఈవిధంగా అతని మీద నాకభిమానం ఎక్కువవుతూండగా అతన్ని గురించి దారుణమైన సంగతి తెలిసింది. తెలిసిందేమిటి? అతనే చెప్పాడు—తనకు చుట్టుపక్కల నలుగురైదుగురు ఆడవాళ్లతో ఇలాకా ఉందని!

నేనంతకు పూర్వం వ్యభిచారం చాలా చెడ్డదనే నమ్మకంతో ఉండి, అంత చెడ్డది కాకపోవచ్చును దేశకాలపాత్రలను బట్టి అని అనుమానమైనా లేకపోవటంవల్ల, దాన్ని గురించి ఆలోచించిన పాపాన పోయిన వాణ్ణి కాను. ఇప్పుడికది తప్పకపోయింది. ఎందుచేతంటే, నేను త్వరగా అభిప్రాయం మార్చుకునే వాణ్ణి కాను మరి. రంకుతనం చెడ్డదనే అభిప్రాయం మార్చుకోటం చేత ఇష్టం లేదో, అతను పెద్ద మనిషిఅన్న అభిప్రాయం మార్చుకోటం అంతకన్న ఇష్టం లేదు. నిజం విచారిస్తే మొదటి అభిప్రాయం నాది కాదు, రెండోది నా సొంతం. ఆత్మగౌరవాన్ని గురించి ఉపన్యాసం ఇన్నిసార్లు నాకు నేనే ఇచ్చుకున్న నేను ఇంత స్వల్పవిషయంలోనే దాన్నెందుకు పోగొట్టుకోవాలి? నాది కాని అభిప్రాయంమీద గౌరవం చేత నాసొంత అభిప్రాయాన్ని ఎందుకు మార్చుకోవాలనిపించింది.

ఆలోచించగా ఆలోచించగా రంకుతనానికి మూడభ్యంతరాలు కనపడినై. ఒకటి, రంకుతనం అవినీతి అందుచేత ఆపని చేసే పురుషుడి భార్య మనస్సూ స్త్రీ భర్త మనస్సూ వ్యధపొందుతై. దానికి తగిన కారణం ఉన్నా లేకపోయినా, వ్యధ పొందటం నిజమే కనక అవినీతి అనటానికి సందేహం లేదు. రొండు, రంకుతనం వల్ల ఒకరు కన్న పిల్లలు మరొకరి పాల పడటాని కవకాశం ఉంది. ఇది ఆలోచించిన కొద్దీ దారుణంగా కనపడ్డది. మూడు, ఒకరి నించి మరొకరికి వ్యాధులూ అవీ పంపకం కావటం. దాన్ని గురించి ఆలోచించ బుద్ధయినా పుట్టలేదు. పార్వతీశాన్ని వాదనలోకి దింపితే ఈ మూడు కారణాలూ ఎట్లా తోసేస్తాడో అర్థం కాలేదు. అంతవరకూ అతని పెద్దమనిషి తనానికి భంగం కలుగుతున్నదనే భావించవలసొచ్చింది తప్పని సరిగా.

కాని తీరా ఈవిషయం తెచ్చిం తరవాత పార్వతీశం నాకు ఊపిరి తిరగకుండా మాట్లాడాడు.

“ఒకరకం స్త్రీపురుషసంయోగం తీసుకుని అదే రంకుతనమని నమ్ముతున్నావు! నేనది అంగీకరించను. యాభై యేళ్ల వాడు మూడో పెళ్లి చేసుకుని ఆపిల్ల ఇష్టాయిష్టాలు విచారించకుండా ఆవిడతో సంసారసుఖం ఏ రంకుతనం కన్నా ఘోరంగా

కనిపిస్తుంది నాకు. అది చెరచటమే నంటాను అది నీకయితే నే నాచరించేది అంతకన్నా హెచ్చయిరెట్లు ధర్మం. నా రంకుతనంలో—నువ్వన్న మాటే అంగీకరిస్తాను—అనేక భార్యాభర్తల కలయికలో లేని సౌందర్యం ఉంది. నాకు స్త్రీ అవసరం లేందీ ఇల్లు బయలుదేరను. అప్పుడు కూడా నాకోసం కని పెట్టుకుని ఉన్న ఆ కదాని దగ్గిరకే పోతాను. నా రంకుతనంలో కక్కుర్తి లేదు. నాగో చెత్తి లేదు. నాకు, వెంట పశ్చాత్తాపం గాని, అసూయ గాని, ఏ ఇతరమనోజాడ్యం గాని లేదు. మనస్సుకు కాని శరీరానికి కాని జబ్బు చెయ్యని ఆనందం. దాన్లో ప్రేమ కూడా ఉంది. ఒక్క భార్య ఎదురుగా కూర్చుని ప్రేమ ఎక్కడుందా అని తల పగిలేటట్టు ఆలోచించే వాడికన్న నే నెంత నయం! నన్ను ప్రేమ అనేక రూపాలతో ఎదుర్కొంటుంది!

"నువ్వు చెప్పే నీతి ఆడదాన్నీ మగవాణ్ణీ ఆజన్మాంతం కట్టేసి చెప్పరాని బాధ తెస్తుంది. ఏ స్త్రీని ఎప్పుడు వదిలెయ్యాలో నాకు తెలుసును. అట్లా వదిలెయ్యటం నీకు భయంకరంగా ఉంటుంది. కాని అది మాఇద్దరికీ మంచి దని తెలిసినప్పుడే నే నటువంటి పని చేస్తాను.

"అదీ కాకుండా ఈవిషయం నీతి యావత్తూ విశదంగా తెలుసుకునే దాకా ఇది నీతి ఇది కాదని చెప్పరాదు. రోగా లున్న వాడి భార్య వాడితో కాపరం చెయ్యకపోవడం నీతా కాదా? నువ్వా లోచించ లేదు! స్త్రీపురుషులు అన్యోన్యంగా ప్రేమించుకుని మూడో కంటివాడికి తెలీకుండా రంకుతనం చెయ్యటం నీతా కాదా? ఆలోచించ లేదు! రహస్యంగా పిల్లలను కని ఇంకోరి భారం మీద వదిలిపెట్టటం నీతి కాదు! సరే, మూడు జన్మాల దరిద్రుడు సాలుకో పిల్లను కనటం నీతా అవినీతా? ఆలోచించ లేదు!

"నువ్వు ఒక్క విషయం ఆలోచించ లేదోయి! నీతి ఒక్కడి వల్ల ఆచరణలోకి వచ్చేది కాదు. అది సంఘంమీద ప్రసరించి నాగరికతనూ సంఘాన్నీ వృద్ధి చెయ్యాలి. ఈలోపల నేను రోగాలు తగలకుండా, నావల్ల ఇతరులకు గర్భాలు రాకుండా నా చాతనైన జాగ్రత్త పడటం లేదను కోకు!"

"ఇదంతా నాకు పట్టలేదు నా కల్లా ఒక్కటే దిగులు! ఈనాటివరకూ నాకు దొరికే ఆడవాళ్ల విషయంలో నేను పొరపాటు పడటం లేదు. మరేం లేదు. తాత్కాలికంగా కలుసుకున్న కొన్నేపూ అవతల మనిషికి నామీద పూర్తయిన ప్రేమ ఉండాలి. అటువంటి మనిషి కాదని మొదటి చూపులోనే తోచిందా ఆవిడ రంభ గానీ తిరిగి అటు చూడను. ఇంతవరకూ నాఇన్‌స్టింక్ట్ సరిగానే పని చేస్తున్నది. పొరపాటున నా మీద ఇష్టంలేని మనిషిని సమీపించి ఒకసారి చివాట్లు పడ్డా ననుకో! ఇక నన్ను నేను క్షమించుకో గలనా? తరవాత ఆత్మహత్య చేసుకోటం తప్ప గతి లేదు. నాకంత అభిమానం ఉంది. ఇంతవరకటువంటి పరాభవం జరగలేదు. ఏక్షణం జరిగినా జరగవచ్చును! ఒకడు నా చెయ్యి చూసి నిన్ను స్త్రీ మోసగిస్తుం దని చెప్పాడు. తనకు పామిస్ట్రీ బాగా రా దని కూడా ఒప్పుకున్నాడు. కాని నన్నామాట మధ్యమధ్య బాధిస్తూంటుంది, బ్రదర్!"

నే నతని ధోరణికి దిగ్భ్రమ చెందాను. ఇటువంటి ఉపన్యాసం నే నెన్నడూ వినలేదు.

"అయితే ప్రేమను గురించి నీ అభిప్రాయం లోకాభిప్రాయానికి భిన్నంగా ఉన్నట్టు కనిపిస్తుందే!" అన్నాను.

"లోకం ఊహించుకునే ప్రేమ పద్యా లల్లటానికీ రైల్వే నవలలు రాయటానికీ మాత్రమే పనికొస్తుంది. నేను ప్రేమ అనేది నా అపరిపూర్ణత్వానికి

పరిపూర్ణ మైనది. అది ఎక్కువ భాగం శరీరసంబంధ మైనది. నాతో సంబంధ మున్న ఆడవాళ్లను గురించి నేను పూర్తిగా తెలుసుకోను. తెలుసుకున్న ఉత్తరక్షణం ప్రేమ పలాయనం అవుతుంది. ఈ తెలుసుకోవటం మనిషి లోపాలకే కాక ఒక్కొక్క సారి మంచి గుణాల కూడా వర్తిస్తుంది. ఒకప్పుడు నాతో సంబంధం గల అమ్మాయి నా ఎదట తన అవినీతిని దూషించుకుంది. వెంటనే నేను ఆమెను వదిలిపెట్టి వచ్చేశాను. నా కామెను చూస్తే కోపం రాలేదు కాని ఇక మా ఇద్దరికీ తాత్కాలికంగా నైనా పరిపూర్ణ మైన ప్రేమ కలగ దని నే నెరుగుదును!”

ఉత్త ఉపన్యాసం వినటం అట్టే కష్ట మనిపించలేదు కాని రంకు పురాణం ఎత్తగానే నాకు వికారం ప్రారంభ మైంది నా మొహంలో అత నేదో మార్పు గ్రహించి ఉండాలి; వెంటనే విషయం మార్చాడు.

“మరో ముఖ్య మైన విషయం,” అన్నాడతను. “అనేకమంది ఈవిషయంలో శీలవంతు లనిపించుకునే వాళ్లు తమ శీలాన్ని స్త్రీ సంపర్క మనేది జీవితంలో లేకుండా చేసుకుని ఆడదానికి మైలు దూరంలో నైనా ఉండక దక్కించుకుంటారు. వాళ్లకు మాతృత్వం ఏమిటో ఎన్నటికైనా తెలుస్తుందా? అసంభవం. నేను నాతల్లి మాదిరిగా ప్రేమించగల స్త్రీ కనీసం ఒకతె ఉంది. నాకన్న రెండేళ్లు చిన్నది. నమ్ముతావా? ఆవిడ నామనస్సును పైనుంచి కిందకి చదవగలదు. నా మంచి చెడ్డలు ఆవిడ దగ్గిర దాచలేను. ఆవిడ నాకన్న ఎంతో అబల, ఆవిడ దగ్గిర ఉంటే నాకు కొండ ఉన్న ట్టుంటుంది! మనస్సుకు ఆందోళన కలిగినప్పుడల్లా వెళ్లి వాళ్ళింటో పదిరోజు లుండి వస్తుంటాను!”

ఈవిషయమై అతని దగ్గిర మళ్లీ సంభాషణ తాలేదు నేను. అతను చెప్పిన ముక్కలు వారించుకుంటూ చాలా రోజులు గడిపాను.

నా ఉద్యోగం ఇంకా నెలరోజులలో అఖరవుతుం దనగా జరిగిం దా ఘోరం!

ఆరోజుల్లో పార్వతీశంలో మార్పు గ్రహించాను. అతను యథాప్రకారం వారాని కో రాత్రి ఇల్లు వదిలిపోవటం మానుకున్నాడు. దానికి బదులు ప్రతిరోజూ సూర్యాస్తమయం వేళ ఎక్కడికో వెళ్ళి దీపాలు పెట్టగానే రావటం మొదలు పెట్టాడు.

ఒకరోజు అత నింటికి రాగానే “కొత్తసద్దా!” అని అడిగాను.

అతను కాస్సేపు నావైపు పరధ్యానంగా చూసి “నాలో ముసలివాడి లక్షణాలు కనిపిస్తున్నయ్యా?” అని అడిగాడు.

ఏ మట్లా అడుగుతున్నా వన్నాను.

“మరేం లేదు. కొంచెం ఉటోపియ నయిపోతున్నా నేమో అని భయం వేస్తున్నది. అది తప్పకుండా వార్ధక్య లక్షణమే!”

“ఏం?”

“ఎవరో పిల్లను చూసి నాకీ పిల్ల లభిస్తే ప్రపంచకమే అక్కర్లే దనుకోటా న్నేమంటావు? నా కిటువంటి దింతవరకూ ఎన్నడూ జరగలేదు.”

“ఇప్పుడు జరిగిందా?”

అతను కాస్సేపు గంభీరంగా ఉన్నాడు. కాని చూస్తుండగానే అతనిలో నే నెన్నడూ గమనించని ఉద్రేకం వచ్చింది. “ఆపిల్లకోసం గుండె కోసేసుకుంటా నోయి! నాకు ముసలితనం లేదూ ఏమీ లేదూ! ఆపిల్ల నాభార్యా అయి ఉంటే నేను పరస్త్రీ వంక చూడక పోయి ఉందును! ఛీ! ఏం బతు కిది?...(నవ్వుతూ) కీచకుడికి ద్రౌపదిని చూడగానే ఇట్లాగే అనిపించిం దేమో?”

నేను అప్రయత్నంగా “అదేం పోలిక?” అన్నాను

అతరవాత ప్రతిరోజూ అతనిలో మార్పు గమనిస్తూ వచ్చాను. ఒకరోజు ఉత్సాహంగా పొంగి

పోతూండేవాడు. ఒకరోజు పలకరిస్తే కళ్లనీళ్ల పర్యంతం అయేటట్టుండేవాడు. "స్త్రీ వ్యసన మయింది. ఉన్మాదం తల కెక్కింది!" అను కున్నాను. అతన్ని ఏవిధమైన ప్రశ్నలూ వెయ్య లేదు నేను.

గురువారం నాడు సాయంకాలం అతను నాతో "ఇది దుర్భరం అవుతున్నది. మా సీతమ్మను చూసి రావాలి!" అని ఇల్లు వదలిపెట్టి పోయి నాడు. ఆరాత్రి అతను అమితసంతోషంగా ఉన్నాడు—పెన్నిధి దొరికినవాడల్లే! అనూచే అడిగాను. దొరకనే దొరికిందన్నాడు.

మర్నాడు సాయంకాలం అతను వెళ్లిన పావు గంటకే తిరిగి వచ్చాడు. అతని ఆనందం వర్ణనా తీతం!

ఆరాత్రి అతను పెళ్లికొడుకల్లే ముస్తాబయి నాడు. గడియారం చూసుకుంటూ కాలు నిలవక నేమో అటూ ఇటూ బోనులో మృగమల్లే పచారు చెయ్యటం మొదలుపెట్టి పది కాగానే బోనులో నించి వదిలిపెట్టిన ఎలికల్లే బయటికి జారుకున్నాడు.

పదకొండయింది. నాకు నిద్ర పట్టలేదు. అతను వచ్చేవరకూ మేలుకుని ఉండటం మర్యాదగా ఉండదు. నేనతనికి ఉత్సాహభంగం ఏవిధంగానూ కలిగించలేదు అంతవరకూ. అతను వచ్చే వరకూ నేను మేలుకుని ఉండటం కూడా అతని మనస్సుకు కష్టం కలిగించవచ్చును. పదకొండున్నర అయింది. కళ్లు మండుతూన్నా నిద్దర మాత్రం వచ్చేటట్టు లేదు. నా ఆలోచనకు దారీ తెన్నూ లేదు. పన్నెండు!

బయట అడుగుల చప్పుడు. నేను నిద్రలో ఉన్నట్టు పడుకున్నాను.

"ఎవరండీ లోపల?"

"ఎవరది?" అంటూ నేను పక్కమీద లేచి కూర్చున్నాను.

"నేను డాక్టరుగారి నౌకర్ని. మీ పార్వతీశం గారు బతికేట్టు లేదండి. మిమ్మల్ని డాక్టరుగారు దబ్బున రమ్మన్నారు."

ఈమానవప్రకృతి కొన్నికొన్ని విషయాల్లో మారదేమో ననిపిస్తుంది. వాడు స్పష్టంగా పార్వతీశమని చెబుతూంటే నేను పార్వతీశం కాదని నామనస్సును రెండు నిమిషాలు నమ్మించాను. అప్పుడు ఒక్కసారిగా దడ పుట్టుకొచ్చింది. వణుకుతూ లేచి తలుపు దగ్గిరగా వేసి వాడి వెంట రొప్పుతూ నడుస్తూ సంగతి కనుక్కున్నాను. బ్రాడీ పేటలో గుడికి సమీపంలో ఎవరో పడి ఉన్నట్టు చూసి పక్కనే ఉన్న బండీమీద డాక్టరుగారింటికి చేర్చాడుట ఒక పెద్దమనిషి. ఎవరో పార్వతీశాన్ని గట్టి కర్రతో వెనకనించి బలంగా కొట్టారు. తల అడుచుకు పోయింది. బతకటం అసంభవం! నాకు చెమటతో బట్టలు తడిసిపోయినై.

నేను వెళ్లేటప్పటికి అంతా మించిపోయింది. డాక్టరుగారు కాగితంమీద పార్వతీశం నోటివెంట వచ్చిన మాటలు రాసి పెట్టి చూపించాడు. "అనుకున్నంత పని అయింది. బతకటం అనవసరం. మా సీతమ్మను చూస్తే—" ఇంకా ఏమిటో గొణిగాడట, డాక్టరుగారికి స్పష్టంగా తెలీలేదు.

డాక్టరుగారి కుర్రవాడు శవం మీది గుడ్డ తీశాడు. ఆదృశ్యం చూడగానే నాకు మూర్ఛ వచ్చేటట్టయింది. కళ్లలోకి నీళ్ళు దిగి అదృష్ట వశాత్తూ చూపు చెడ్డది. నేను తల పక్కకు తిప్పుకోగానే వాడు మళ్ళీ గుడ్డ కప్పేశాడు.

అంత సాహసం ఎవరు చేశారో తెలీనే లేదు! అర్థం లేకుండా నేను వెర్రివాడల్లే గుడిచుట్టూ తారట్లాడటం మొదలుపెట్టాను ప్రతిసాయంత్రమూ. ఒక రోజున ఎక్కడో చూసినట్టున్న మొహం కనపడ్డది గుళ్ళోకి పోతూ. తరవాత జ్ఞాపకం వచ్చింది నాభార్య! చాలా అందగత్తె అయింది! నాభావమరిది!! తాగుబోతు వెధవ!!

నా రక్తం వేడెక్కి వేడి చెవులవెంట రావటం మొదలుపెట్టింది. పార్వతీశం చావుకు పెద్దమనిషల్లే పగతీర్చుకో గలనా?

బయట నాభార్య కోసరం కనిపెట్టుకుని ఉండి తరవాత ఆమెను వాళ్ళింటి దాకా వెంబడించాను. నన్ను చూడగానే నాభార్య మొహం మూడురంగులు మారింది.

ఎవరూ నన్ను మర్యాద చెయ్యకుండానే నేను లోపలికి పోయి సావిట్లో నాభార్యను రెక్కపట్టి నిలవేశాను.

"నాస్నేహితుణ్ణి చంపించింది నువ్వేనా?"

మాట లేదు. మొహం మరో రంగు మారింది.

"నువ్వతని వంక ప్రేమతో చూడకపోతే అతనంత పరవశుడు కాడు. నీఅన్నతో నువ్వెందుకీవిషయం చెప్పాలిసొచ్చిందీ? అతనే కనుక్కున్నాడా?"

మాట లేదు. కాని నాపట్టు నాకు తెలీకుండానే బిగిసి ఉండాలి. నాభార్య చిన్న కేక పెట్టి చెయ్యి వదిలించుకోవాలని చూసింది. నేను పట్టు మరింత గట్టిగా పట్టాను.

"అబ్బబ్బ! నన్నడిగాడాయన! అందుకని చెప్పాను! అమ్మమ్మమ్మ!"

"అంత మాత్రానికే నీ పాతివ్రత్యానికి భంగం కలిగిందా? అంత పతివ్రతవు మీవాళ్ళను పాటించకుండా నాదగ్గిరికెందుకు రాలేదు? అతన్నెందుకు ప్రోత్సహించావు? ఏరకం ప్రోత్సాహం లేకుండా అతను నిన్ను అడిగే స్థితికొచ్చాడా?...నీమీద పగ తీర్చుకుంటాను! నిన్ను నేను ఆదివరకు వదలకపోయినా ఇప్పుడు వదిలేస్తున్నాను. నువ్వెక్కడున్నా నేను వెయ్యి కళ్ళతో చూస్తూంటాను. నువ్వే రోజు ఇంకోడితో పోతే ఆరోజు నీకు నాచేతులో చావు తప్పదు! నిన్ను బహిరంగంగా చిత్రవధ చేస్తాను....మగవాడికి ఇంకో మగవాడి మీద ఎంత ప్రేమ ఉండవచ్చునో అంత ఉంది నాకతనిమీద! మమ్మల్నిద్దర్నీ ధ్వంసం చేశావు ఒక్కదెబ్బతో" నా కళ్ళ వెంట నీళ్ళు కారటం మొదలుపెట్టినై. నేను వెంటనే ఆచోటు వదిలిపెట్టి ఇంటి దారి పట్టాను. దారి వెంట నాభుజం మీద చెయ్యి వేసి పార్వతీశం నడుస్తున్నట్టయింది! నా వేడి తక్షణం దిగిపోయింది.

నోట్లో నువ్వగింజ

కొల్లూరు ధర్మారావుగారు, బి. ఏ.

— ఉదయం ఆరు గంటలవేళ —

(యింట్లో)

"జానెవ్, యివాళ వంట కాస్త త్వరగా కాని"

"చేసే వుద్యోగమేమిటి ఇప్పుడంత తొందరకి!"

"ఉందిలే, వేరే ఒక..."

"చెబుదురూ కాస్త?"

"యీ ఆడవాళ్ళతో యిదే బాధ; అది వేరే ఒక రహస్యం; నీతో చెబితే అడగకళ్ళేను. నీ నోట్లో నువ్వుగింజ నానదు."

"ఒట్టూ, యెవరితో చెప్పినా. చెప్పండి."

"చిన్న ఉద్యోగం వోటి కలిసొచ్చే లాగుంది. కోటలో గుమాస్తాగిరీ ఓ అర్నెల్లు ఆక్టింగు ఉమేజువారీ తటస్థపడేలాగుంది"

"ఉమేజువారీ అంటే?"

"నీ కక్కడలేని భోగట్టాలూ కావాలి— ఉమేజువారీ అంటే జీతం యివ్వరు. అయితేనేం లే, తర్వాత లాభిస్తుంది."

"జీతం బత్తెం లేని నౌఖరీకి అర్నెల్లే అని నిర్ణయమెందుకూ?"

"నీతో చెప్పడం పొరపాటు. వంట చేస్తావా, సొసాకూ కబుర్లేనా?"

*   *   *   *

— ఉదయం ఏడు గంటలవేళ —

(చెరువుగట్టున)

"సూరమ్మత్తా, మీది మడిబట్టైతే యీ బిందె కొంచెం యెత్తుకుకూ."

"అప్పుడే వంట మడి కట్టుకున్నావులే, సుబ్బమ్మా, యేమిటి విశేషం?"

"యేమీ లేదో, వూరికేనే"

"ఓస్, నవ్వుతున్నావు, యేదోవుంది, చెబుదూ!"

"....................."

"నీ మొగుడామధ్యని కలకత్తావో యెక్కడికో నౌఖరీ కోసాన్ని వెళతానన్నాడనుకున్నారు, వెళ్లలేదేం?"

"మీ రెవళ్లతోటీ అననంటే చెప్తాను."

"ఒట్టూ. నాకేం గావాలమ్మా అందరితో చెప్పడానికీ?"

"మా ఆయనకి దివాణంలోనే నౌఖరీ అయింది. అందుకే యీ తొందర"

"సుఖపడ్డావమ్మా, జీతం యెంత?"

"......ప......పాతిక"

"యేదో, వేన్నీళ్లకి చన్నీళ్లు. ఉన్న వూళ్లో ఇదిమాత్రం యెంత గాను"

"ఎక్కడా అనకండేం, యింకా?"

"ఛెస్, యెంతమాట!"

*   *   *   *

— ఉదయం తొమ్మిది గంటలవేళ —

(బజారులో)

"ఏమిరో, పుల్లయ్యా. యీమధ్య నెక్కడా ఏప్యం అయిపోయేవు?"

"ఏ మదుగుతా వబ్బీ! ఇది మూడో మాటూ విశాఖపట్నం వెళ్లడం. కాళ్లరిగిపోయి డబ్బైపోతూంది కాని నౌఖరీ యెక్కడా పుట్టలేదురా."

"మెట్టు ప్యాసై నువ్వే యిలా గంటూ శేం ఒరే? కోటలో చాలా ఖాళీ లున్నాయిట్రా. ప్రయత్నించవో లేదో."

"ఖాళీ లెక్కడోరే, ఖజానా పెట్టెల్లో తప్ప"

"సరిపోయింది! నీతో చదూకున్న రంగడికి ముప్పై రూపాయలమీద వేసేరుటా?"

"ఎప్పుడూ?"

"అదేమో, నీలాటిరేవు నంతా అనుకుంటున్నారని మాఅమ్మ చెప్పింది ఇందాకా!"

"పోస్, నే న్నమ్మను. తరుదుఫారం వాడి కేమిటి..."

"అలా కొట్టి పారెయ్యకబ్బీ! అదృష్టానికీ చదువుకీ సమ్మంధం యేమిటి?"

*   *   *   *

— ఉదయం పదకొండు గంటలవేళ —

(వాల్తేరు స్టేషనులో)

"ఇదుగో, విజయనగరం నుంచేనా యేమిటి రావడం?"

"అవును, మీరేమిటిలా దయచేసేరు?"

"మీవూరెడదామనే, మరేమిటి వింతలు?"

"యేమున్నాయి?"

"మా మేనల్లు డెప్పుడేనా కనిపిస్తూంటాడా? మా రంగరావు"

"వారం రోజులకిందట చూసేను. కులాసాగా వున్నాడు. వాడికి కోటలో ఖిల్లేదారీ ఉద్యోగం అయిందిట?"

"నాకేం తెలీలేదే. మీకెవరు చెప్పేరూ?"

"ఏమో, విజయనగరం స్టేషనులో కాఫీతాగుతూండగా యెవళ్లో పదిమందీ అనుకుంటూన్న మాటలు నాచెవిని పడ్డాయి. అయినా తరుదుఫారం వాడికంత ఉద్యోగం..."

"చెప్పలేం లెండి. అయితే కాకూడదూ! వాళ్లతండ్రి ప్రభువులదగ్గిర విశ్వాసంగా మెసిలిన నౌఖరు."

"మీ కుతరం రాయలేదూ?"

"అదే ఆశ్చర్యంగా వుంది"

*   *   *   *

—మధ్యాహ్నం మూడు గంటలవేళ—

(కంటోన్ మెంటు బంగాళావద్ద)

"ఏమోయ్. దివాన్ గారు నిద్ర లేచేరేమో చూడూ."

"ఇక్కడ గలభా చెయ్యకండి, కోప్పడతారు గేటు అవతల వుండండి."

"పదిగంటలనుంచీ కనిపెట్టుకున్నాను, ఇంకా నిద్దరపోతున్నారా?"

"నేరమ్మన్నానుటయ్యా...యేమిటీయన భాష. హూ...వెళ్లండవతలకి!"

"వోయ్ చూడూ...(చేతిలోకి వో అర్ధరూపాయి జారవిడిచి)...కొంచెం కనిపెట్టాలి కాని..."

"పేరయ్య సాస్తుర్లుగా రబ్బాయిలా, మీరు!"

"నువ్వెరగం దేముంది?"

"ఆ బెంచీమీద కూర్చోండి, దివానుగారిలాగే వస్తారు."

*　　*　　*　　*

"చిత్తం"

"ఎవర్రోయి ఆతవలా?"

"చిత్తం. ఏలినవారి దర్శనానికని వొచ్చేను. దరఖాస్తు దాఖలుచేసు..."

"ఎందుకండీ?...మీ పేరు?"

"రంగారావు"

"దరఖాస్తెందుకు, మీకేం గావాలి?"

"తమ ఆఫీసు ఇలాకాని ఓ ఆక్టింగు ఉమేదారీ ఖాళీ వొచ్చిందని"

"లాభంలేదండి, ఇవాళ పదిగంటలప్పుడో కర్ని పాయింటు చేసీసేను."

"చిత్తం చిత్తం, తమరు తలిస్తే..."

"మరి మీ పనైంది, వెళ్లండికను."

"అన్నం పెట్టించా లంటే..."

"వోయ్ డఫేదార్, వీరి నవతలకి పంపింయ్."

*　　*　　*　　*

—సాయంత్రం అయిదు గంటలవేళ—

(బజారు రోడ్డున)

"ఏమిరో రంగా, యిలా గొస్తున్నావు? బండీ గుఱ్ఱం సప్లై లేవేమిటి?

"నీకంత హాస్యంగావుంది. ఇహాను జట్కా తోలుకుంటేనే బాగుండే లాగుంది."

"నౌఖిరీలో ప్రవేశించకే పోవాలికాని, బ్రదర్, ప్రవేశించాక జట్కావాడి వృత్తే బాగున్నట్టనిపిస్తుందిలే. ఇంతకూ కొట్టేవు మంచిఛాన్సు. బాలెప్పుడేమిటి?"

"పోనిద్దూ వొరే యేడిపించకా?"

"కోటలో పాగా వేసి యెదుపేం నీకూ? నువ్వెంత బాలు ఎగరెయ్యడానికి దాచినా నాకు తెలీ లేదనుకున్నావు. కాబోలు. మీమామ వార్తరులో కనిపించి చెప్పేడులే"

"మధ్య మా మామేంవిటి చెప్పేడు?"

"నీకు ఖిల్లేదారీ అయిన భోగట్టా!"

"హరీ, దీని తస్సాగొయ్యా!"

*　　*　　*　　*

రాత్రి యెనిమిది గంటలవేళ

(ఇంట్లో)

"ఈ గమతు చూసేవే."

"ఏమిటండో యి?"

"నాకు ఖిల్లేదారీ అయిందని మామామ అన్నాట్ట విశాఖపట్నంలో! దిక్కుమాలిన గుమాస్తాగిరీ కోసం ప్రయత్నం ఆరంభించి పన్నెండు గంటలైనా కాలేదు. యీ బుకారేమిటి చెప్మా?"

"హాశ్చర్యం!"

"నేను రెండో కంటికి తెలీకుండా అవస్థపడితే, యిదేమిటో?"

"....................."

"నువ్వెవళ్ళతోటీ అనలేదుకద?"

"ఒట్టూ......ఒక్క నూరమ్మత్తతో మాత్రం ఎవళ్ళతోటీ చెప్పనని వొట్టేయించుకు చెప్పేను పొద్దుట."

"మరేం? పెదవిదాటింది, పృథివీదాటింది!"

శాసన పద్యమంజరి

(శేషాద్రిరమణకవులు.)

వాఙ్మయవేత్తలును బరిశోధక వతంసులును నగు బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతులువారు ప్రచురించిన శాసనపద్యమంజరి జూచి మిగుల నానందించితిమి. శాసనములలోఁ బద్యవాఙ్మయ మెంత విరివిగ వ్యాపించెనో అప్పటి లిపి లేఖనక్రమము వాఙ్మయవికాసము సూక్ష్మదృష్టితో గమనింపఁదలంచువారల కీగ్రంథ మెంతయు నుపకారము జేయును. గ్రంథము రాయలు సైజులో ౧౧౩ పుటలు గలిగి నాలుగు శాసనపటములతోడను ౪౨ శాసన పాఠములతోడను నలరారుచున్నది. ఈయుత్తమ గ్రంథమును స్వల్ప మగు వెలకు ఒసంగుట యొక విశేషము. నిజాము రాష్ట్రమునకు సంబంధించిన పద్యశాసనము లిందు రెండుమాత్రమే గలవు. ఒకటి కరీమునగరము శాసనము. ఇది గంగాధరుఁ డను రుద్రదేవుని మంత్రి నెలకొల్పినది. అందుండి రెండు పద్యములును ఒక పద్యార్ధము మాత్రమె యుదాహరింపఁబడినది. మిగిలిన భాగము వారికి లభించి యుండదు. కాననే శతాబ్దము నూహించియు అసంపూర్ణ మనియు నుదాహరించిరి. ఈశాసనముఁ గాకతీయచరిత్రమునకుఁ జాల విలువగల సాధనము. దీనిపయి నొక లఘువిమర్శము మార్చి నెలలో వెలువడిన ప్రబుద్ధాంధ్ర యందుఁ గాంచ నగును. రెండవది ఉప్పరపల్లి శాసనము. దీని ప్రతిబింబము విమర్శము భాషాంతరీకరణము నిజాము దొరతనమువారి శాసనశోధక సంఘమువారు ప్రకటించిరి. దీనిలోని చివరఁ గల యొక పెద్ద వచనము తొలగింపఁబడినది. అది యుంచినచో నానాఁటి వచనస్వరూపము గూడ గుర్తింప వీలయ్యెడిది. ఇంకను గొన్ని పద్యశాసనములు నిజాము రాష్ట్రమునకు సంబంధించినవి ప్రచురింపఁబడినచో నెంతయో బాగుండెడిది.

ఈసంపుటమునఁ గల పద్యశాసనములలో నన్నయ్యభట్టారకునకు ముందుఁ బుట్టిన పద్యశాసనములు రెండు గలవు. ఇందొకటి క్రీ. శ. ౮౪౪ నాఁటి గణగవిజయాదిత్యుని మంత్రి యగు పండురంగనిది. ఈశాసనము మంజరిద్విపదలో నుండి యాకాలపు వాఙ్మయచ్ఛందోవిశేషములఁ దేల్చుచున్నది. దీని యందలి విశేషములు కే వి. లక్ష్మణరావు పంతులవారి చిత్రాడ ఆంధ్రపరిశోధకమహామండలి యధ్యక్షోపన్యాసమునఁ జర్చింపఁబడినది. లక్ష్మణరావుపంతులువారు సరి యగు ప్రతిబింబమునకుఁ బ్రయత్నించు నాటికే శాసనశిల మాయ మైనది. సరి యగు ప్రతిబింబముతో శ్రీ. జ. రామయ్యపంతులువారు ప్రకటించి మనకు మహోపకృతి గావించిరి. రెండవది యుద్ధమల్లుని బెజవాడశాసనము. ఇదియు నన్నయభట్టారకునకు బూర్వపుదే. పద్యములు మధ్యాక్కరలు. ఇందు ద్రవిడకర్ణాటభాషలలో నుండి ప్రకృతవాఙ్మయమునఁ గనిపింపని యొక వింత యక్షరపు టునికి శ్రీ లక్ష్మణరావు పంతులవారు గమనించి యాచర్చ నంతయుఁ బ్రకటించిరి. శ్రీరామయ్యపంతులువారు, ఈసిద్ధాంతము నామోదించి యావర్ణము కాలక్రమమున "డ" గా మారుట సూచించిరి. ఈరెండుశాసనము లీగ్రంథమునకు అలంకారము లనవచ్చును.

దీర్ఘాసి, దాక్షారామ పద్యశాసనములు రెండును నన్నయ్యభట్టారకుని నాఁటివి. ఈరెంటివలన నన్నయ్యభట్టు కాలమున బలువు రాంధ్రకవులు గలరనియు నన్నయ్యభట్టారకుఁడు ప్రథమాంధ్రకవియను కొనుట భ్రాంతి యని తేలును. ఈరెండు పద్యశాసనములవలన నన్నయ్య నాటి వాఙ్మయవిశేషములు కొన్ని తెలియును. అనునాసికములుగ

నుచ్చరింపఁ బడుటకుఁ గాబోలు అరసున్న రాఁదగిన తావులం దెల్ల నిండుసున్న వాడఁబడినది. ఇంతియకాక ప్రాసస్థలము దీర్ఘము మీఁది యరసున్న నిండుసున్నగ "కూంతు సరియ పోల్పం గాంతలెందు" అని ప్రయోగింపబడినది. ద్రాక్షారామశాసనములోని సీసపద్యమునందలి ఎత్తుగీతలో నొక తావున మాత్రము యతియు మిగిలిన త్రావులందెల్లఁ బ్రాసలును గలవు. దీర్ఘాని శాసనమునందు సీసపాదములం దంతటను బ్రాసములును గీతమునందు యతులును గలవు. ఇంతియ గాక గిడ్డిసింగి యనుచో ఛందోభంగము గలుగకుండుటకు రేఫ తేలబలుకుటయు శసలకు బ్రాసము ఏండ్లు అనుచో ఏండులు అను వ్యస్తరూపము విశేషించి గమనింపఁ దగినది. దీర్ఘాని భగవతి + దేవి యనుచో ప్రాస వదలి యతి వేయఁబడుటచే నాకాలమున నియమము బాధకముగా దనియు దలంపవచ్చును. శాసనములలో గల పేరులు గొన్ని యిపుడు వాడుకలో లేవు. ఈ దేశ్యనామములలో రేవలదేవి, పొన్నరాంబ, బాదమ్మ, గడియమదేవి, పెన్నమ్మ, విల్లమ్మ, దండ్యమ్మ, దోరమ్మ, కబ్బలదేవి, జన్నమ్మ, రకమాంబ బెజ్జము బెజయితదేవఁడు, గొంకరాజు, కన్నోజు, మండరాజు, బంగేన, పెమ్మడి, పండయ్య, గంటఁడు, దేసన, నల్లరాజు, గోరంటప్రభువు, విద్దయ్య, చింతమనాయకుఁడు, బల్లరాజు, పెఱుకువగోద్యన, లోనగునవి యిపుడు వాడుకలో లేనివి. ప్రాచీన శబ్దముల పట్టికవలె మనుష్యులయు గ్రామములయు నామముల పట్టిక సిద్ధము చేయుటయు వాఙ్మయసేవలో నొక భాగము కావచ్చును. గోద్యన అనునది గోవిందశబ్దమునకు దద్భవ మని విశ్వసింపవచ్చును. ఇటులే శాసనములందు గ్రామముల యొక్కయు మనుజుల యొక్కయుఁ బేరులు ప్రాచీనవాఙ్మయస్వరూపమును బోధించుచున్నవి.

వర్ణక్రమసంబంధములు, వ్రాతకు ఉచ్చారణములకుఁ గల భేదములు శబ్దలక్షణమునకు సంబంధించిన ప్రయోగవిశేషములు ఛందోవిషయము అను శీర్షికల క్రిందఁ బంతులువారు గావించిన విమర్శము వారి పరిశోధనపాటవమునకుఁ బ్రాచీనాంధ్రస్వరూపనిరూపణమునకు లక్ష్యముగ నున్నది.

శాసనపద్యములు గొన్ని మాత్రము కేవలముగ నున్నను జాల భాగము కవితాప్రౌఢిలోఁ బ్రాచీన ప్రబంధకవితకు దీసిపోవకున్నవి. శాసనగ్రంథకర్తల పేరులు స్థాపకు లుదాహరించినచోఁ గొందఱు కవులు మనకుఁ బరిచితులయ్యెడివారె గానిత ఱుమగ నాయాచారము మున్నున్నటులఁ దెలియదు. శ. స. ౧౦౪౦ నాటి వెల్లబోలు శాసనమున విశ్వకర్మవంశజుఁ డగు సూరఁడు సోదరసహితుఁడై సంగరములలోఁ బ్రత్యర్థుల నెదిర్చి విజయము బడసి ఎఱ్ఱమండ జనవిభునిచే నాదరణ సత్కారాదులు బడసిన యంశము ప్రత్యేకించి గమనింపఁ దగినది. వృత్తి జీవనముఁ గాక రాజకీయమునఁ గూడ విశ్వకర్మకులజులు పేరొందిరనుట కీశాసనము ప్రధానాధారము. ౧౬౧ెం శ. స. ౧౦౬౨ నాటి నాదిండ్ల శాసనమున పోతన సోమయాజి ప్రశంస గలదు. ఈ సోమయాజి వైదికాచారరతుఁడు. మహాజ్ఞాని. అతని వంశజులు సంగ్రామైకజీవను లగు మంత్రులు. బ్రాహ్మణు లాకాలమున నియోగి వైదికి భేదము పాటింపక లౌక్యరాజకీయములలోఁ బాల్గొని రనుట కీశాసన మాధారము కాఁగలదు. శ. స. ౧౦౬౭ నాటి చేబ్రోలు శాసనమువలన చతుర్థవంశజుఁడును భీమరాజు కుమారుఁడు నగు పండఁడు మనకుఁ బరిచితుఁ డగుచున్నాఁడు. ఈపండఁడు దేసటి విశేషణము వలనఁ బంటరెడ్డి కులజుఁడు కానోఁపు నని తోఁచును. ఇతఁడు సర్వకలాప్రవీణుఁ డఁట. అంతియ గాక కవి యని సైతి మాశాసనమున నీక్రింది పద్యమునఁ జెప్పఁబడినది

కవిత్వములో అయోమయత్వము

"ఈ కాలపు కృతు లనేకము లు పులుముడుతో చాలా అయోమయంగా ఉన్నవి" అని "నేటికాలపు కవిత్వము" అనే గ్రంథంలో శ్రీ సుదక్షిణ-రాజు ఉమాకాన్తంగారు వ్రాశారు. ఈవాక్యము నిరూపించడానికి వారు

"పెద్దపులినోటిలో నేనేను
పేడబొబ్బ పెడతాను నేనేను
భార్య నీ ఒక చెంప నేనేను
భర్త నీ ఒక చెంప నేనేను."

మొదలైలవి చాలా ఉదాహరణా లిచ్చారు. చిట్టచివర,

బ్రహ్మ గుర్రంబాయె శివుడు పల్లంబాయె
నాదివిష్ణు వెన్న నంకె నాయె
నందుమీదివాడు అడదో మొంగవాడో
విశ్వదాభిరామ వినుర వేమ

అనే వేమన్న పద్యము కూడా ఈ అయోమయ కోటిలో చేరుతుం దన్నారు.

అయోమయత్వము అంటే ఏమిటి? అని మా ప్రశ్న. తెలియకపోడమేనా? అట్లయితే ఈ తెలియకపోడము రెండంశాలమీద ఆధారపడుతుంది. ఒకటి కర్తమీద. రెండు చదువరిమీద.

"నిరు కారంబాయె కారంబు నీరాయె"
"కారమందు నీరు కడురమ్యమై యుండు"

అని వేమన్న వ్రాశాడు. కారము. నీరు అన్నవి వేటికో సంజ్ఞలు. అవి ఫలానా అని తెలియకపోతే, చదువరి ఎంతవిద్వాంసుడైనా అర్థము చేసుకోలేడు. "బ్రహ్మ గుర్రంబాయె..." అనే పద్యములో సగుణ బ్రహ్మరూపములైన బ్రహ్మ శివుడు ఆదివిష్ణువు అనేవారికి ముగ్గురికి పైన "అడదో మొంగవాడో" గుణములే ఆరోపించడానికి శక్యముకాని బ్రహ్మమున్నదనే ఊహ వేమన్న వ్యక్తపరిచాడు. మెళ్లో లింగకాయో, మొగాన్ని పట్టెనామాలో పెట్టేవారికి ఇది అయోమయమే. ఏమంటే వేమన్న వారి కతీతుడు.

కవిహృదయ మతిసున్నితము. సాధారణులు చూడలేని అందమతడు చూడగలడు. ఆనందించగలడు. ఆ ఆనందము పరులు కూడా పొందాలని కావ్యము రచిస్తాడు. ఇ. చదువరి కూడా మూగకవేనా అయుండాలి. లేకుంటే కవిహృదయ స్పందనానికి ప్రతి స్పందనము చేయదు ఈతని హృదయము. ఎప్పుడూ 'అరటిపండొలిచి' నట్లు కవి రచించడు. 'గుప్పిటనిడి' ఊరిస్తాడు. చదువరి పక్షాన్న కూడా ప్రయత్న ముండకపోతే కావ్యపఠనము సఫలము కాదు. కవి వ్రాసిన ఘట్టము శక్తివంతమైనా ఆ పరిస్థితులలోనికి వెళ్ళలేని చదువరి ఉంటాడు అప్పుడాతనికి కవిత్వ మయోమయము లాగే కనబడుతుంది.

ఈ కాలపు కృతులు చాలామట్టుకు ఆత్మాశ్రయాలు ఠాగూరు కృతుల్లాగ. ప్రబంధ కవులకి రాజులు, పురాణకవులకి అదర్శవీరులు సామగ్రి ఐతే ఆధునికులకి తమ జీవితాలే సామగ్రు లౌతున్నాయి. అట్లని డైరీలో ఎక్కించే సరుకంతా కవిత్వములోకి దిగుతుందని, కవిత్వమంతా ఆత్మప్రశంసే అని ఉమాకాన్తులవంటి పండితులు తూలనాడవచ్చును. కవిత్వాని కందువల్ల వచ్చేనష్టము లేదు. ప్రతి మానవుడి జీవితమూ నలుడూ, దమయంతి, రాముడూ, భీముడూ, వీరి జీవితాల్లాగ చిత్రముగా ఉండకపోవచ్చు. కాని ప్రతిమానవుడి జీవితములోనూ, కొన్ని దివ్య ఘట్టాలుంటాయి. ఆసమయములో కృష్ణుడి పెదిమెలు ముట్టిన మురళి వెదురుగొట్టములాగ అతని హృదయము స్పందిస్తుంది. తరువాత ఆసౌఖ్యము స్ఫురణకి తెచ్చుకుని రచించుతాడు కవి ఐతేను. అతని ఉద్దేశ్యము తనకి ఇదివరకు కలిగిన భావాలు మనకి కలిగించడమే. మన హృదయాలు ఇనప హృదయాలైతే కవి గింజుకుని చచ్చినా సరే స్పందించవు. ఈ కవిత్వము కాళి

దాసాది సంస్కృత కవుల రచనవలె పరాశ్రయ ముకాదు.

కవిత్వము మానవుడి రచన కాబట్టి అతని హృదయము తాలూకు ముద్ర ఉంటుంది దానిలో. అవి పరులకి ఉద్దేశించబడినవి కాబట్టి సర్వజనీనములైన భావాలుంటాయి. అయోమయమని ఉమాకాన్తులన్న కవితలో కవికి తన భావాలే సామగ్రి కాబట్టి మొదటి గుణము హెచ్చుంటుంది. పరాశ్రయకవిత్వములో సామగ్రి కవికంటేవేరు, అందరు చదువరులు కవి చెప్పకుండానే యెరిగి ఉన్న సామగ్రిని గురించినదై యుంటుంది కాబట్టి సర్వజనీనములైన భావాలుంటాయి. మన సంస్కృత పండితులు పరాశ్రయ కవిత్వము వినడము అలవాటు పడ్డారు. వారి భావనాబలము, కవి సృష్టించే వింత ప్రపంచములోని సౌందర్యము చూడడానికి ప్రయత్నించే వరకే. వారిదివరకే ఒక ప్రపంచము చూశారు. దాని కొక వింతమెరుగు పెట్టిన ప్రపంచమును వారూహించాలి అంతే. అధునికులు తమ భావబలమువల్ల సృష్టించిన అంతా కొత్తప్రపంచమును మన కిస్తున్నారు. దీన్ని అనందించడము చాలామట్టుకు చదువరి మీద ఆధారపడుతుంది. అతనేపాటి కేవలద్రష్టే అయినా కవిత “అయోమయమే” అయిపోతుంది. రాగూరు తాజమహాల్ గురించి రచించిన ఖండము చూడండి.

“రాజ్యాలు బూడిదగా కూలిపోయినా, శతాబ్దాలు నీడలలో మురిగిపోయినా, ఆ పాలరాతికట్టడమింకా నక్షత్రపథముతో “నేను మరచిపోను” [I remember] అని నిట్టూరుస్తోంది.”

ఈఖండముకూడా ఉమాకాన్తుల అయోమయ కోటిలోనే చేరుతుంది. ఏమంటారా! తాజ్ మహాల్ అరవడమేమిటి, ఆకాశమేమిటి వినడమేమిటి? ఇది శంకరుల అద్వైతమా, వైయాకరణుల శబ్దబ్రహ్మవాదమా అని దీనిని కూడా తూలనాడవచ్చును. కాని షాజహానునికి ముమ్‌తాజ్ బీగమ్ మీద ఉండిన అనురాగమే ఆమె గోరీకి రక్ష అయిందనీ, రాజులూ రాజ్యాలూ నశించి పోయినా గాని నిత్యకల్యాణముగా తన మీద నుంచీ, యమున మీదనుంచీ తిరిగే ఆకాశానికి “నాకింకా జ్ఞప్తి ఉంది.” అని తాజ్ మహాల్—అంటే షాజహాను అనురాగము—చెప్తూతున్నట్లుందనీ, వారికి ఉత్ప్రేక్ష చేసినట్టు చెప్పితేగాని బోధపడదు.

భవభూతి ఉత్తర రామచరిత్రములోని “వినిశ్చేతుం శక్యో న సుఖ మితివా దుఃఖ మితి వా” అనే శ్లోకమూ అయోమయమే. “ఏం? తాగేదేమిటి? రమణీస్పర్శ ఇచ్చే అనందానికి కాబోలు ఇన్ని కూతలు కూసేదేమిటి?” అని అడగ వచ్చును. చదువరి సహృదయుడు కాకపోతే రసఘట్టాలెన్నో యిలాగే కనబడతాయి. “పెద్దపులినోటిలో...” అనే ఖండము సర్వజీవులలోనూ వెలిగే చైతన్యమే నా వెలుగు అనే భావాన్ని భగవంతుడు చెప్పినట్టు రచించినది. అది రసవంతము కాకపోవచ్చు. కాని అయోమయమంటే మేమనేది “నీవు సహృదయుడవు కావనే.”

“నన్నుగనియేను జాలిచెందంగ వలదు
యేననంత శోకభీకర తిమిర లోకైకపతిని”,

అను కృష్ణశాస్త్రి ఖండకావ్యమూ అయోమయమే మన ప్రయత్నములేకుంటే. “ప్రేమపట్టునకు బిచ్చగాని చేయి చాచి” నాడట ఇతడు. ఎత్తినది కర మెత్తినట్లే కృశించె “నంటాడు. అతని చిరుతపాటకే విశ్వము ఇరుకైందట. మరి” నాటనుండియు ప్రతినిశీథతమంపుకాటుకలచాటున...ఓచెలీ” అని పిలిచి “ఏడుస్తాంట, ఇలాంటివ్యక్తికి సహచారిణి దుఃఖమేమరి. అతడు శోకభీకర తిమిరలోకైకపతి కాడూ? కాని తన అనుభవాలు ఏవీచెప్పకుండానే శోకభీకర తిమిరలోకైక పతినన్నాడు. అందువల్ల అయోమయ మనేస్తున్నారు. అది చదవగానే కవి దుఃఖితుడని తెలుస్తుంది. “అఁ. సరే, తరవాత?”

అని యెందుకు బయలుదేరరాదు చదువరి? ఆశలేని యీ దుఃఖమువల్ల దృశ్యము విషాదాంత మెందుకై పోలేదని ప్రశ్నించండి. అంతేకాని యిది అయోమయమా? ఆశ అంకురించడము కవి వ్రాయలేదు. అందువల్ల నిది ఖండమై పోతుంది (fragments) దాని కిచ్చే గౌరవము ముట్టచెప్పండి.

తర్కమూ వ్యాకరణమూ సహృదయత్వాన్ని నశింప జేస్తాయి.

కత్తికోతలేదు గాజుగొట్టములేదు
మాతృనేత్రశోధ నేతలేదు
యొవర ప్రకృతిదేవి యొడిజేరి చనుగ్రోలి
మేనుమఱచి నిదుర కాని కవికి.

చదువరి బడిపిల్లవాడు వ్రాసిన వ్యాసాలుదిద్దే మేష్టరు లాగ బయలుదేర కూడదు. కావ్యము పఠించబోయే విద్యార్థిలాగ గౌరవదృష్టితో మాడాలి.

—కౌశికః

హిందీవల్ల తెనుక్కి జరుగుతూ వున్న అపకారం

(ఈవిషయంలో యిదివరకు చాలా లేఖలు ప్రకటించి వున్నాం. వచ్చినవి యింకా చాలా వున్నాయి. విఖ్యాతాంధ్రకవీశ్వరులు మంగిపూడి వేంకటశర్మ గారు కూడా సమగ్రంగాచర్చ చేస్తూ వొక వ్యాసం పంపారు. అదీ, మరికొన్ని వచ్చే సంచికలో ప్రకటిస్తాము. మాతృభాషాభిమాను లనేకులు ఈవాదాన్ని బలపరుస్తూ అనేకస్థలాలలో వుపన్యాసాలు చేస్తున్నారు. పత్రికలకు రాస్తున్నారు. హిందీ ప్రచారకులు కూడా కొందరిందులో వున్న సబబు గ్రహించి ప్రోత్సాహం కలిగిస్తున్నారు. ఇక్కడ వొక సోదరీమణి రాసిన చిన్న లేఖ మాత్రం యీ నెలకు ప్రకటిస్తున్నాము. ఈమె హిందీలో చాలా ప్రవేశం సంపాదించిన్నీ మాతృభాషయెడల అభిమానం పోగొట్టుకోకుండా, హిందీమానస పుత్రుల దుష్ప్రచారాన్ని యెదుర్కుంటూ మాతృసేవ చేస్తూ వున్నందుకు మాప్రశంసలు తెలుపుకుంటున్నాము. సంపాదకుడు)

సోమయాజులుగారూ! ఆంగ్లభాషపట్ల మీరు వ్యతిరేకాభిప్రాయ మేల చూపుచున్నారు? విదేశభాష యనియా? విదేశీయులగు ఆంగ్లేయులు మన యీదేశమును పాలించుచుండునంతవరకును మనకు ఆంగ్లభాష ముఖ్యావసర మనియే నేను చెప్పుచున్నాను. హైందవరాజ్యాంగమునకు సంబంధించిన యాభాష నభ్యసించినవారే రాజ్యాంగవిషయములు తెలుసుకొనగలుగుచున్నారు, కాబట్టి స్త్రీపురుషులు ఆంగ్లభాష తప్పక చదువవలెను. ఆర్థిక, రాజకీయ, సాంఘిక, ధార్మిక—ఇత్యాదివిషయములకు సంబంధించిన పుస్తకములు మనము ఆంగ్లమునందే చూచుచున్నాము. హిందీయందు గాని తెనుగునందు గాని స్వతంత్రముగ రచించబడిన పుస్తకములు మనకుగాన్పించుట లేదు. ఏదేని యొకటుండిన అది ఆంగ్లమునకు అనువాదమే!

ప్రతి పెద్ద గ్రామములోను స్థాపింపబడిన యాంగ్లపాఠశాలలను గూర్చి వ్రాయరైతి రని మీరు నుడువుచున్నారు. ఆంధ్రభాషయందే ప్రేమ యున్నచో ఆంగ్లభాషాప్రచారముపట్ల వ్యతిరేకాభిప్రాయము చూపుట మంచి దని మీ రన్నారు. కాని అత్యవసరము లగు ఆంగ్లభాషకు గాని ఆంగ్లపాఠశాలలకు గాని వ్యతిరేకాభిప్రాయ మెవరు చూప సమ్మతించెదరు? ఈభాషాప్రచారమునకు

ప్రతిగ్రామములోను ఒక మిడిల్ స్కూలు అయినను ఉంచుట ముఖ్యావసరము. కాని మన స్త్రీపురుషుల దౌర్భాగ్యము వలన ఐదారు గ్రామములకు ఒక స్కూలు ఉన్నది. ఈస్కూలులనందైనను స్త్రీ పురుషులు తప్పక ఆంగ్లభాష అభ్యసించవలయు ననియే నేను ప్రార్థించుచున్నాను.

మన సుబ్రహ్మణ్యశాస్త్రిగారనునట్లు, ఆంగ్ల భాష అపకారముతో పాటు ఉపకారము కూడ చేయుచున్నది. ఆంగ్లభాషలో గొప్ప వాఙ్మయ మున్నది. ఇటువంటి భాష యెడల వ్యతిరేకాభి ప్రాయము చూపుట మంచి దని మీ రెట్లు నుడువ గలిగిరి? కాని హిందీభాష చదువకూడ దని కాదు నేను చెప్పునది. మొదట మాతృభాష స్త్రీపురుషులు చక్కగ అభ్యసింపవలెను. అటుపిమ్మట రాజ్యాంగమునకు సంబంధించిన భాషయు, తరువాత యింకెన్ని భాషల నైనను నేర్చుకోవచ్చును. కాని ఇక నైనను హిందీభాషయందుండు ప్రేమచే ఆంగ్లభాషయెడల మీరు ఈర్ష్య చూపకుందురని నేను విశ్వసించుచున్నాను.

—యేర్లగడ్డ చిలకమ్మ

స్వీకారము

బొమ్మల మద్రాసు

ఆశా, సంకల్పమూ వుండీ కూడా చాలా మంది మద్రాసు వెళ్ళలేరు; కాని అది చూడ తగ్గ నగరం. విశేషించి మనం పట్టుబడి సంపాదించుకోవలసిన స్థలం. మద్రాసులో మనం చెయ్యవలసిన పని చాలా వుంది.

వెళ్ళలేనివారికి మద్రాసు అంటే బోధపడడానికీ వెళ్లిన వారి కేనా సులభంగా పరిచితం కావడానికీ మద్రాసుకి సంబంధించిన బొమ్మలు వుండడం చాలా అవసరం.

ఖండాంతరాలలో ప్రతీ పెద్ద నగరానికీ ఇలాంటి యేర్పాటు ఉంటాయి.

ఇప్పుడు మద్రాసు విషయంలో యీలోపం కొంతవరకూ తీరింది.

కోమా ఫొటో సర్వీసువారు మద్రాసులో వున్న ప్రసిద్ధ—ప్రధానస్థలాలకు ఫొటోలు తీసి సెట్టు సెట్టుగా అందరికీ అందచేస్తున్నారు.

వాటిలో వొక సెట్టు—రెండోది మా కార్యస్థానం అలంకరించింది. ఇందులో ౧ హైకోర్టూ, ౨ సెంట్రల్ స్టేషను స్టాన్లివంతెనా, ౩ రామస్వామి మొదలియారు సత్రమూ, ౪ ఎగ్మోరు స్టేషనూ, ౫ ఐస్‌హౌసూ, ౬ క్వీన్ మేరీకళాశాలా, ౭ పెట్టర్సరీకళాశాలా, ౮ సెనేటుహౌసూ, ౯ డి. పి. డబల్‌యు సెక్రటరియటూ, ౧౦ మర్కంటైలు బాంకీ ౧౧ పెన్‌లాసుపార్కూ, ౧౨ బర్మాషెల్ కంపెనీ భవనమూ—మొత్తం పన్నెండు ఫొటోలు చక్కనివి వున్నాయి. ఈ సెట్టు వెల పోస్టుఖర్చులు కాక వొక రూపాయి. మనవారు వీటిని సంపాదించి మద్రాసును గురించి కొత్త ఆశలు కల్పించుకుంటూ రని నమ్ముతున్నాం *

* కావలసినవారు ఈక్రింది అడ్రసుకు రాసుకోవాలి. "కోమా ఫొటో సర్వీసు. ట్రిప్లికేను మద్రాసు."

వ్యాఖ్యానములు

ఆంధ్రోద్యమం

నిజమే కావాలా? అయితే కాంగ్రెస్సు మనల్ని తొక్కేసింది; వుద్ధరించలేదు.

మన జాతీయతని అది ఛిన్నాభిన్నం చేసేసింది.

అన్ని ప్రాంతాల వారితో పాటు అఖిలభారత వికాసం కోసం పని చెయ్యవలసిన పూచీ మనకిన్ని వుంది. అయితే అది పరిమితం. దానికి హద్దు వుంది. ఇప్పటి లాగ మన శాయశక్తులూ దానికోసం విని యోగించవలసిన అవసరం యేమీ లేదు.

అసలు మనకి ఆ అవకాశమే లేదు. ఏమంటే? మన కిప్పుడు ఆంధ్రత్వమే దృఢంగా—సమగ్రంగా లేదు.

మొదట మనం ఆంధ్రులం. తరవాతే భారతీయులం. మనం సర్వవిధాలా ఆంధ్రులంగా చెలామణీ కాగలిగినప్పుడే భారతీయతలో మన అంశ ప్రకాశమానంగా వుండగలుగుతుంది.

భారతీయత అంటే, యీ భిన్నప్రాంతాల వారి కలయికవల్ల స్ఫురించే భావమే; కాని దానికి విశిష్టరూపం లేదు

కాలు సరిగా లేకపోతే మనిషి కుంటివాడయి నట్టే—కన్ను కనపడకపోతే గుడ్డివాడయినట్టే—చెవి వినపడకపోతే చెవిటివాడయినట్టే యీ భిన్న ప్రాంతాలవారిలో యెవరు నీరసంగా వుండినా ఆభారతీయతకి కుంటితనమో, గుడ్డితనమో—యేదో వొక వైకల్యం యేర్పడుతుంది.

భారతీయతకి సంపాదించవలసిన వికాసం వేరు. అది వొక్కొక్క ప్రాంతం వారిలోనుంచి వొక్కొక్క అంశ—వొక్కొక్క కిరణం వెడితే రాశిగా ఏర్పడి తిరుక్కు మనిదే కాని మరో విధంగా సాధ్యపడేది కాదు.

ఈ పరమార్థం బోధపరుచుకుని చూస్తే మన స్థితి బోధపడుతుంది.

వొక స్వదేశీ విషయం చూద్దాం. ప్రతీ వస్తువూ మన కిదివరకి ఖండాంతరాలనుంచి వచ్చేది. అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, కలంపుల్ల—చివరికి ఏడ్చే పిల్లల చేతిలో పెట్టడానికి బిస్కత్తులు కూడా ఏస్వీడనో, యే జర్మనో, యే యింగ్లండో పంపితే కాని మనకి దిక్కు లేకపోయీది. ఇప్పు డివన్నీ హిందూదేశంలోనే తయా రవుతున్నాయి. నిజమే. అయితే మన ఆంధ్రత్వాన్ని స్మరించుకుంటూ చూడండి. అగ్గిపుల్ల మనకి రంగూన్నుంచి రావాలి. సబ్బుబిళ్ళ బొంబాయినుంచి రావాలి, కలంపుల్ల కలకత్తా నుంచి రావాలి. బిస్కత్తులు పునహానుంచి రావాలి. చివరికి తూడుగుడ్డలలో గుడ్డలు కూడా అహమ్మదాబాదునుంచి రావాలి. మన కేమీ లేదు. ఇతరప్రాంతాలకి యెగుమతీ చెయ్యడం దాకా వద్దు, సొంతానికి వాడుకోడానికే మన దగ్గర యేమీ లేదు. అన్నీ పైనుంచి వూడిపడాలి.

వానలు కురవకపోతే కూడా మనం బతగ్గలం; గాని యీ దిగుమతీలు ఆగిపోతే మనకి వూపి రాడదు.

వొక్క డబ్బు మాత్రమే మనం ధారాళంగా యెగుమతీ చెయ్యగలం. చెయ్యగలుగుతున్నాం. చేస్తున్నాం.

అంటే, మనం యిదివర కెలాంటి స్థితిలో వున్నామో యిప్పుడూ అలాంటి స్థితిలోనే వున్నాం.

ఇప్పుడు కాంగ్రెస్సు దృష్టి యేమిటో పరిశీలించండి "ఈ చిల్లర వస్తువు లేనా మనం ఖండాంతరాలనుంచి దిగుమతి చేసుకోవలసిన అవసరం తప్పిపోయింది. కనక అందరూ యివ్వే వాడండి. విదేశాలనుంచి వచ్చే వాటిని ముట్టకండి" ఇదీ కాంగ్రెస్సు బోధ.

కాంగ్రెస్సుకింద అడగిపోయి వున్న ఆంధ్రుని స్వదేశీ అభిమానం అంటే యిదీ.

ఈస్థితిలో—ఇలాంటి సమయంలో భారతీయతకి మనం యేమి పుష్టి కలిగించగలమూ?

మనం బాగుపడాలంటే—యిరుగుపొరుగు వారితో మనం సమానస్థాయిలో వుండాలంటే—తుదకి కాంగ్రెస్సులో కూడా మనం తగినంత ప్రయోజకత్వం చూపించాలంటే మొట్టమొదట మనం మనంగా తయారు కావాలి. ఆంధ్రుడంటే రక్తమాంసాలు లేని కంకాళం అని కాక 'కొదమ సింగం' అని తక్కిన ప్రాంతాలవారు గుర్తించేటట్టు తయారు కావాలి.

ఈ ఫలం లభించాలంటే ఆంధ్రోద్యమమే మనకి గతి. ఆంధ్రమహాసభే మనకి ఆధారం

వొకప్పుడివి రెండూ "నాయనా! నువ్వు ఆంధ్రుడవోయీ!" అని మనల్ని తట్టి లేపాయి. "లే. ఎవరేం చేస్తున్నారో చూడు" అని మన కళ్ళు తెరిచాయి. "వురుకు. వెనకపడిపోతున్నావు. సాటివారు తొక్కేస్తారు సుమా" అని వుత్సాహం కలిగించాయి. నిజంగా మనకి అప్పుడు ప్రబోధం కలిగింది. ప్రత్యభిజ్ఞానం కలిగింది. స్వస్వరూపం కూడా బోధపడింది. రక్తనాళాల్లో వేడివేడి కొత్త రక్తం వురకలు వేసింది; కాని మంచి రసకందాయపు పట్టులో నడమంత్రపు కాంగ్రెస్సు వచ్చి వీటిమీద దెబ్బ కొట్టింది.

ఇంతే కాదు. స్వార్థపరులైన కంపెనీ యేజంట్లు మనవాళ్ళని కూలీలుగా ఖండాంతరాలకి తీసుకుపోతూన్నట్టు గుజరాతీలకీ, హిందూస్థానీలకీ మనల్ని భృత్యులుగా తయారు చేసింది కాంగ్రెస్సు.

మన ఆంధ్రోద్యమాన్ని అడిచేసింది. మన ఆంధ్రమహాసభని నేలమట్టం చేసింది. మన రాష్ట్రవాంఛని తునాతునకలు చేసేసింది. కాంగ్రెస్సు ఆంధ్రజాతిమీద వొక్క ముసుగు పెట్టేసింది.

"సంపూర్ణస్వరాజ్యమే మనకి లక్ష్యం. తెనుగు జిల్లాలను విడదీసి వొక ప్రత్యేకరాష్ట్రంగా నిర్మించవలసిందని దొరతనం వారిని కోరడం సహాయనిరాకరణవ్రతులమైన మనకి నామోషీ పని. అది మన ఆత్మగౌరవానికి భంగకరం" ఇదీ మనకి కాంగ్రెస్సు చేసిన వుపదేశం.

మనం యీ వుపదేశాన్ని పూర్తిగా తలకెక్కించుకున్నాం. దీనితో మనకి ఆంధ్రత్వం మరుపు వచ్చింది. నైజాము రాజ్యంలో మన ఆంధ్రులు మాహమ్మదీయులు అయిపోతూవుంటే మనకి తెలవలేదు. బళ్ళారి ప్రాంతంలో మన జాతి పిల్లలకు మన తల్లి, తెనుగుభాష దూరమయిపోతూ వుంటే మనకి కనపడలేదు. చిత్తూరుజిల్లామీద ఘాటయిన అరవ ముద్ర పడిపోతూ వుంటే మనకి బోధ కాలేదు. మద్రాసులో వొకరోజుకంటే వొకరోజు మన స్థితి అధ్వాన్నమయిపోతూ వుంటే మనకి చీమ కుట్టినట్టు లేదు. చివరికి గంజాంజిల్లా వోఢ్రదేశంలో కలిసిపోతూ వుంటే కూడా మనకి నొప్పి కలగలేదు. ఇప్పటికీ మనకి అసంపూర్ణ స్వరాజ్యమే లక్ష్యం.

అయితే; యిప్పుడు ధర్మాతిక్రమణం చెయ్యడానికి జంకని యీ సరిహద్దులవారు అప్పుడు మాత్రం మన హక్కులు గమనిస్తారా? విడిచిపెడతారా?

ఇదంతా యెందుకు వచ్చింది?

తనకు మాలిన ధర్మం లేదు లేవండి. నడుంకట్టండి. ఇప్పుడేనా యింకా మించిపోయింది లేదు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణపు టాశ యింకా కనుమరగిపోలేదు. మన ముక్తి మన చేతుల్లోనే వుంది. మన కాళ్ళమీద మనం నిలవ కలిగినప్పుడే అఖిల భారతోద్యమంలో మనకి ఆవాహన వున్నా విసర్జన వున్నానూ.

కనక మనం యిప్పుడేనా కూడపలుక్కుని, ఆంధ్రోద్యమానికి మళ్ళీ ప్రాణప్రతిష్ఠ చేసుకుని, ఆంధ్రమహాసభని మళ్ళీ సమావేశపరుచుకుని ఆంధ్ర వికాసానికి అత్యవసరమైన—ప్రధానసాధనమైన ప్రత్యేకాంధ్రరాష్ట్రాన్ని సాధించుకోవాలి.

ఇదే మన కిప్పుడు ధ్యేయం ఇదే ప్రాప్యం. ఇదే పరమావధి.

జాతీయత కల ప్రిన్సిపల్

"వ్యవహారాని కంత కావాలో అంతే హిందీ నేర్చుకోవాలి; కాని అందులో పండితులు కావడానికీ, పుస్తకాలు రచించడానికీ ప్రయత్నించకూడదు. అంత హిందీభాషాపరిజ్ఞానం మనకి అవసరం లేదు. బొడ్డూడని పిల్లలు కూడా హిందీ అక్షరాలు, అ, ఆ, ఇ, ఈలు నేర్చుకోవడం చాలా విచారకరం..హిందీలో పరీక్ష లుండకూడదు"

ఆంధ్రజాతీయ కళాశాల ప్రిన్సిపలు కోలవెన్ను రామకోటేశ్వరరావుగారు, హిందీపరీక్షాసిద్ధులకు యోగ్యతాపత్రా లిచ్చిన బందరు సభలో చెప్పిన మాట లివి

విద్యార్థుల నవజీవితాలకు జాతీయతాసంస్కారం కలిగించవలసిన ఆచార్యదేవుని బాధ్యత యీ మాటల్లో ప్రతీ అక్షరంలోనూ అతిజటిలంగా కనపడుతోంది. సామాన్యభాషగా అంగీకరించబడ్డ హిందీకి అనాదరం చూపకుండానూ, మాతృభాష అయిన తెనుక్కి దెబ్బ తగలకుండానూ యిలాగ తూచినట్టు మాట్లాడడం నిజంగా కొనియాడ తగ్గ సంగతి. దేశాభిమానం చూపించడంలోనూ, నాయకులుగా చెలామణీ అవుతూ వున్న వారి ఆజ్ఞలను అనుసరించడంలోనూ విశేషం లేదు; కాని తన బుద్ధిని వినియోగించి పెద్దల సందేశాలకు చక్కని వ్యవస్థ చూపించడంలోనే ప్రజ్ఞ వుంది.

రామకోటేశ్వరరావుగారు ఇంగ్లీషులో ఎం. ఏ. పరీక్షలో ఆరితేరినవారు. ప్రఖ్యాతి పొందిన ఆంగ్ల మాసపత్రిక (త్రివేణి) కి సంపాదకులు. ఆంధ్ర వాఙ్మయానికి వారు కలిగించిన పుష్టి యేమీ లేకపోయినా వారు మాతృభాషయొక్క ఆప్రతిద్వంద్వపదవిని గుర్తించి వున్నారు. ఆంధ్రవాఙ్మయం యొక్క నవీనవికాసావశ్యకాన్ని బాగా గ్రహించి వున్నారు. కనకనే వారు హిందీయొక్క దురాక్రమణాన్ని యిలాగ నిక్కచ్చిగా ప్రతిఘటించకలిగారు.

జాతి అంతా అనుకరణపరాయత్వంలో కుళ్ళిపోతూ వున్న యీ సమయంలో రామకోటేశ్వరరావుగారివంటి, తమ్మో తాము తెలిసిన ప్రతిభావంతులు కొంద రేనా వుండడం ఆశావహంగా వుంది.

జాతీయ కాదు, సామాన్య

రామకోటేశ్వరరావుగారు మన ఆంధ్రదేశంలో హిందీకి నిలిచివుండ తగిన స్థలం చూపించిన సభలోనే డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్యగా రిలా మాట్లాడారు.

"పిల్లలూ వయసువారూ, వృద్ధులూ కూడా తప్పకుండా హిందీ నేర్చుకోవాలి...ప్రతీవారూ హిందీ నేర్చుకుంటే ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక వంటి మాతృభాషాపత్రికల వ్యాపకం తగ్గిపోతుం దనడం హాస్యాస్పదంగా వుంటుంది...హిందూదేశంలో ౧౨౦ కోట్లమంది హిందీ మాట్లాడేవారున్నప్పుడు ఎప్పటికైనా ఆభాషే జాతీయభాషగా పరిగణింపబడుతుంది; గాని మిగిలిన భాషల కెప్పుడూ ప్రాముఖ్యం వుండదు. పైగా కాంగ్రెస్సు ప్రతివారినీ హిందీ నేర్చుకో మని ఆజ్ఞాపించినప్పుడు ఎవరికీ ఎలాంటి శంకలూ, అనుమానాలూ వుండడానికి తావు లేదు"

పట్టాభిసీతారామయ్యగారు "ప్రతీవారూ హిందీ నేర్చుకుంటే ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక వంటి మాతృభాషాపత్రికల వ్యాపకం తగ్గిపోతుం దనడం హాస్యాస్పదంగా వుంటుం" దంటే ఆపత్రికలకు తెనుగుదేశంలో యెంత వ్యాపకం వుండాలో, ఇప్పు డెంత వుందో వారి కేమీ తెలవ దని స్పష్టమే. "కాంగ్రెస్సు ప్రతీవారినీ హిందీ నేర్చుకో మని ఆజ్ఞాపించిం" దంటే వారు ఆ ఆజ్ఞకి పరిమితి గ్రహించలే దని కూడా విశదమే. కనక యీ విషయాల మీద చర్చ అవసరం లేదు.

ఇక వున్న దల్లా యేమి టంటే?

"హిందూదేశంలో ౧౨౦ కోట్లమంది హిందీ మాట్లాడేవా రున్నప్పుడు ఎప్పటికైనా ఆభాషే జాతీయభాషగా పరిగణింపబడుతుంది; గాని మిగిలిన భాషల కెప్పుడూ ప్రాముఖ్యం వుండ" దంటున్నారు వారు.

'జాతీయత' అంటే యేమిటో బాగా విచారణ చేసే అంటున్నారా సీతారామయ్యగారీమాట?

భాషాశబ్దాన్ని సామాన్యపూర్వం చేసినప్పుడూ, జాతీయపూర్వం చేసినప్పుడూ కలిగే అర్థభేదానికి, తూర్పుకీ పడమటికీ వున్నంత నార వుంది. ఏమాత్రం భాషాజ్ఞానం వున్నవారి కేనా యీభేదం సులభంగానే బోధపడుతుంది. అయితే: సీతారామయ్యగారీభేదం తెలపకుండా మాట్లాడుతున్నారని కాదు. ప్రకృతియొక్క నిరంకుశత మీద వారికి నిర్లక్ష్యభావం వున్నట్టుంది.

సేతువు మొదలు శీతాచలం దాకా వున్న ప్రదేశం అంతా భారతదేశ మని పిలవబడుతూ వుండడం సత్యమే. ఈభారతదేశం మాతృభూమిగా గల ప్రజాసమూహం అంతా భారతజాతి అని అనిపించుకుంటూ వుండడం కూడా నిజమే.

కాని యీ భారతదేశాని కంతటికీ—యీ భారతజాతి కంతటికీ భారతభాష అని వొక భాష లేదు. ఏం?

చిత్రవిచిత్రాలైన శీతోష్ణస్థితులు గల యీ విశాలదేశంలో, సహజసిద్ధాలైన ప్రత్యేకవలయాలు గల యీ అనంత జనసముద్రంలో వొకటే భాష వుండడానికి తగిన సన్నివేశాలేమీ లేవు.

"భారతదేశం" "భారతజాతి" అనే యీ మాటలు వశ్యవాక్కులైన మత ప్రవర్తకల నిర్మాణ చాతుర్యంవల్లా, అవక్రపరాక్రమవంతులైన చక్రవర్తుల రాజ్యాంగ విధానంవల్లా వ్యవహారంలోకి వచ్చినవే; కాని సహజంగా పుట్టినవి కావు.

విజాతీయుల సంపర్కం యెరగని ఆరోజుల్లో, వారు గీర్వాణభాష అనే వొక ప్రత్యేకభాష ద్వారా అనుబంధం కలిగించుకుని సాముదాయిక వ్యవహారాలు కొనసాగించుకున్నారు.

అప్పుడేనా వారు దానికి 'దేవభాష' అని యెవరికీ తగాదా లేని పేరు పెట్టుకున్నారు; కాని 'జాతీయభాష' అని దానికి పట్టం కట్టలేకపోయారు.

తరవాత వచ్చి దేశాన్నంతా కలిపిన వుర్దూ భాషకీ, యిప్పుడమల్లో వున్న యింగ్లీషుభాషకీ కూడా 'రాజభాష' అని మరో పేరు వచ్చింది; కాని 'జాతీయభాష' అని రాలేదు

ఇక ముందు కూడా యీ మర్యాద యిలా జరిగిపోవలసిందే; కాని మరోలాగ సాగడానికి వీలులేదు.

కాదూ కూడ దని గాంధిగారూ, గాంధిగారిని అంధవిశ్వాసంతో అనుసరించే వారూ కాంగ్రెస్సు ద్వారా పట్టు పడితే కాంగ్రెస్సు భగ్నం కావడాని కిదే ప్రధానకారణం అయిపోతుంది.

తమ తమ మాతృభాషల్లో నవీనవిజ్ఞానాన్ని సేకరించుకుంటూ వాఙ్మయాలకు సంపూర్ణత సంపాదించుకుంటూ వున్న హిందూదేశపు భిన్నప్రాంతాలవారెవరూ కూడా హిందీకి జాతీయశబ్దాన్ని అతకనివ్వరు.

పైగా మాహమ్మదీయులు హిందీని సామాన్యభాషగానే అంగీకరించడం లేదు. జాతీయభాష అని పేరు పెడితే దాన్ని వారు అసలే తిరస్కరిస్తారు.

అసలు మనవారు మాహమ్మదీయుల హిందీ ప్రతిఘటనం బాగా గుచి చూసే వుండలేరు.

సత్యం యిదీ. ముందు ముందు జరిగేది కూడా యిదే. ఏమి టంటే?

ఆంధ్రులకు ఆంధ్రమే జాతీయభాష. ఇలాగే ద్రావిడులకీ, కర్నాటకులకీ, మహారాష్ట్రులకీ, వంగీయులకీ—తక్కినవారికీని. హిందీ జాతీయభాష అంటే అది హిందూస్థానీలకు మాత్రమే. తక్కినవారి కది వొక ప్రాంతీయభాష. దేవుడు మేలు చేస్తే హిందూదేశానికి సామాన్యభాష. అంటే బజారు భాష మాత్రమే.

ఇంతకంటే దాని కెవరెలాంటి విశేషణాలు కూర్చినా అది జాతీయతకు దూరమైన—యెరగని ప్రసంగం అయిపోతుంది.